మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 187 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

మంగళవారం 10 సెప్టెంబర్ 2024

## ఆప్' ఒంటరిపోరు



- కాంగ్రెస్‌తో పొత్తులేకుండానే హరియాణా అసెంబ్లీ బరిలోకి
- 20 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల

చండీగఢ్ (ప్రజా మంటలు): హరియాణా అసెంబ్లీ ఎన్నికల వేళ అక్కడ కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసు కొంటున్నాయి. భాజపాను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్–ఆప్ కలిసి పోటీ చేసేందుకు మిగతా 8లో..

## మంకీపాక్స్ డేంజర్‌బెల్స్

- భారత్‌లో తొలికేసు నిర్ధారణ
- క్లేడ్–2 రకంగా గుర్తింపు
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- అనుమానితులకు పరీక్షలు చేయండి
- కాంటాక్టులను గుర్తించండి
- కేంద్రం నుంచి రాష్ట్రాలకు సూచన

8లో..



## బెంగాల్ హత్యాచారం ఘటన.. కేసు సవాల్‌గా మారింది

4లో..



# చేనేత కార్మికులను రుణవిముక్తులను చేస్తాం

## నేతన్నలకు శుభవార్త.. రూ.30కోట్ల రుణమాఫీ



- తెలంగాణ విద్యార్థులకు హ్యాండ్లూమ్ కోర్సులు
- విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లకుండా వెసలుబాటు
- ఇన్‌స్టిట్యూట్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు
- నాంపల్లిలో ఐఐహెచ్‌టీని వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ విద్యార్థులకు హ్యాండ్లూమ్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సోమవారం నాంపల్లిలో ఐఐహెచ్‌టీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐఐహెచ్‌టీని ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులు ఏపీ, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లి హ్యాండ్లూమ్ కోర్సులు చదవాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో మాట్లాడి ఐఐహెచ్‌టీకి అనుమతులు తెచుకున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. విద్యార్థుల సమయం వృథా కాకూడదని, మిగతా 2లో..

## త్వరితగతిన గ్రీన్‌ఫార్మాసిటీ

- పనులు వేగవంతం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, (ప్రజా మంటలు): హైదరాబాద్ శివార్లలో గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గ్రీన్ ఫార్మా సిటీ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శషాంక్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. రంగారెడ్డి, మిగతా 2లో..



## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక భారత్

- భాషలు, సంప్రదాయాల పేరుతో వేరు చేయడం సరికాదు
- భారత జాతీయగీతం అన్ని రాష్ట్రాలను ప్రతిబింబిస్తుంది.
- దేశ రాజకీయాల్లో ఇప్పుడు ప్రేమ, గౌరవం, వినయం లోపించాయి
- భాజపా, ప్రధాని అంటే ఇప్పుడు ఎవరూ భయపడట్లేదు
- అది ఎన్నికల ఫలితాలతోనే స్పష్టమైంది.
- రాజ్యాంగంపై దాడిని తాము ఎన్నటికీ అంగీకరించబోమని ప్రజలు స్పష్టంగా చెప్పారు
- అమెరికాలో రాహుల్ కీలక వ్యాఖ్యలు

వాషింగ్టన్ (ప్రజా మంటలు): అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ డాలస్‌లోని ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. మన దేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్న ఆయన.. భాషలు, సంప్రదాయాల పేరుతో ఎవర్నీ వేరు చేసి చూడొద్దని అన్నారు. ఈసందర్భంగా తెలుగు భాష గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం.భారత జాతీయగీతం అన్ని రాష్ట్రాలను ప్రతిబింబిస్తుంది. సమానంగా చూపిస్తుంది. అంతేగానీ.. ఒక రాష్ట్రం బెస్ట్.. మరో రాష్ట్రం సెకండ్ బెస్ట్ అని అందులో ఎక్కడా ఉండదు. ఈ గీతం మన దేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా చెబుతుంది.

## పొలిట్రిక్స్

ఒక్కసారి వచ్చిపోవా
అన్నందుకు వస్తానమ్మ
కానీ వదలనంటూ
మొండికేసిన వానమ్మ !

దంచికొడుతున్న తీరుకు
జనజీవనం అస్తవ్యస్తం,
పంటలన్నీ నాశనం
రైతన్నకు కన్నీరే సమస్తం !

- న్యాలకంటి నారాయణ
9346200066

# భారీ వర్షాలతో తీవ్ర నష్టం

## వరదల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు

- నష్టపోయిన వారికి రూ.16500
- రేపు రాష్ట్రానికి రానున్న కేంద్ర బృందం
- వరద నష్టంపై అంచనా వేయనున్న అధికారులు
- మృతుల కుటుంబానికి ఇందిరమ్మ ఇంటితో పాటు రూ. 5 లక్షలు
- ముంపునకు గురైన ప్రతి ఎకరానికి రూ. 10 వేలు
- తడిచిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం
- చివరి బాధితుని వరకు సహాయం అందిస్తాం
- యుద్ధప్రతిపాదికన తాత్కాలికంగా రహదారుల మరమ్మతులు
- ప్రతి పోలీసు స్టేషన్లో ఫిర్యాదుల కోసం ప్రత్యేక కౌంటర్
- భారీ వర్షాలు, వరదలపై మంత్రి పొంగులేటి ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, (ప్రజా మంటలు): వరద ప్రభావిత ప్రాంతాలలో యుద్ధ ప్రతిపాదికన బాధితులకు సహాయం అందించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బాధితులకు ఈ ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఎవరూ ఎలాంటి మిగతా 2లో..



## - డాక్యుమెంట్స్ కొట్టుకుపోయాయని ఆందోళన చెందొద్దు


## పార్టీ ఫిరాయింపులపై నాలుగు వారాల్లో తేల్చండి

- స్పీకర్‌కు హైకోర్టు హుకుం
- స్వాగతించిన పాలక, ప్రతిపక్షపార్టీలు



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించింది. అప్పటిలోగా నిర్ణయం తీసుకోకపోతే సుమోటో కేసుగా విచారిస్తామని పేర్కొంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని

## ప్రజా నాడి




# బుగ్గారంలో "డిటోనేటర్ల" (బాంబుల) గోదాం వద్దే వద్దు

-పేలుడు పదార్థాల లైసెన్సు లు ఇవ్వకండి

-ప్రభుత్వ విప్ అడ్లూరికి, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ లకు విజ్ఞప్తి చేసిన బుగ్గారం ప్రజలు

-సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్ అడ్లూరి

-ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే పనులు చేయనీయం :

-అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ





జగిత్యాల / బుగ్గారం/ ధర్మపురి సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) : జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలో బాంబుల గోదాం (పేలుడు పదార్థాలైన డిటోనేటర్ల) నిలువలకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని, వెంటనే వాటిని పూర్తి స్థాయిలో రద్దు చేయాలని సోమవారం ప్రభుత్వ విప్ అయిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ కు వేర్వేరుగా బుగ్గారం ప్రజలు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు గ్రామ అభివృద్ధి కమిటి అధ్వర్యంలో పలువురు ప్రముఖులు, గ్రామస్తులు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను ధర్మపురి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.అలాగే జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు సోమవారం జరిగిన ప్రజావాణిలో కూడా స్వయంగా జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ను కలిసి బాంబుల (డిటోనేటర్ల) గోదాం నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు జారీ చేయవద్దని విజ్ఞాపన పత్రాలు అందజేశారు. సంబంధిత అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఎక్కడికక్కడ అనుమతులు నిలిపివేయాలని వారు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ను కోరారు. మిగతా 4లో..

మొదటి పేజీ తరువాయి

## పార్టీ ఫిరాయింపులపై నాలుగు వారాల్లో తేల్చండి

నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్ కార్యాలయ కార్యదర్శిని ఆదేశించింది న్యాయస్థానం. స్పీకర్ కార్యాలయం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్న ఉత్కంఠ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కలుగుతోంది.

### తెలంగాణలో ఉప ఎన్నికలు ఖాయం:కేటీఆర్



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీ హై కోర్టులో ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్ వేసింది. తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కీలక తీర్పు వెలువరించింది. అయితే తెలంగాణ హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై భారాస సానుకూలంగా స్పందించింది. ఈ తీర్పుతో ఇక ఉప ఎన్నికలు ఖాయమని పేర్కొంది. ఈ సందర్భంగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్‌కు హైకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు.

నాలుగు వారాల తర్వాత దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుల ఎమ్మెల్యే పదవులు ఊడటం ఖామన్నారు. పార్టీ మారిన అన్ని నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవని, మొదటి నుంచి ఇదే విషయాన్ని చెబుతున్నామని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ అంటూనే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. న్యాయస్థానాల్లో, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి శిక్ష తప్పదని కేటీఆర్ అన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై హైకోర్డు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలకు చెంపపెట్టు అని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్డు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం తథ్యమన్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు అనర్హతకు గురై ఆయా నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమన్నారు. అనర్హత కారణంగా ఉప ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ తప్పకుండా గెలుస్తుందన్నారు. హైకోర్డు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర శాసన సభాపతి నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని ఆశిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు.

## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక భారత్

అప్పుడు ఒక రాష్ట్రం కంటే ఇంకో రాష్ట్రం ఎక్కువా కాదు.. తక్కువా కాదు. అలాగే భాష, సంప్రదాయాలు కూడా. తమిళం మాట్లాడేవారు మాకు నచ్చరు అని.. హిందీ మాట్లాడేవారే ఇష్టమని మనం చెప్పడం సరికాదు" అని రాహుల్ వ్యాఖ్యానించారు."తెలుగునే తీసుకోండి.. మనం తెలుగు అని చెబుతున్నప్పుడు అది కేవలం భాష కాదు.. ఒక చరిత్ర, ఒక సంప్రదాయం, సంస్కృతి. హిందీతో పోలిస్తే తెలుగు భాష అంత ముఖ్యం కాదని ఒకవేళ ఆ రాష్ట్ర ప్రజలకు మీరు చెప్పినట్లయితే.. వారిని మీరు అవమానించినట్లే..! అలా పోలుస్తూ.. తెలుగు చరిత్ర, అక్కడి సంప్రదాయం, సంస్కృతి, పూర్వీకులు ముఖ్యం కాదని మీరు చెప్పినట్లే..!" అని కాంగ్రెస్ ఎంపీ అన్నారు. ఈ చిన్న తేడాను కొందరు అర్థం చేసుకోకపోవడం వల్లే భారత్‌లో దీనికోసం పోరాటం జరుగుతోందంటూ భాజపా (ఃఏఖ)పై రాహుల్ విమర్శలు గుప్పించారు.భారత రాజకీయాల్లో ప్రేమ, గౌరవం, వినయం వంటివి ఇప్పుడు లేవని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. "భారత్ అంటే ఒకే భావజాలం అని ఆర్ఎస్ఎస్ నమ్ముతుంది. కానీ, భారత్ అంటే భిన్న భావజాలం అని మేం విశ్వసిస్తున్నాం. అమెరికా లో మాదిరిగానే.. అందరికీ ప్రాతినిధ్యం ఉండాలని మేం కోరుకుంటాం. కులం, మతం, భాష, సంప్రదాయాలతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ కలలు కనేందుకు అర్హులే. కానీ, భారత్‌లో ఇప్పుడా పరిస్థితుల కోసం పోరాడాల్సి వస్తోంది. భారత ప్రధాని (మోదీ) రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని మొన్నటి ఎన్నికలతో (2024 సార్వత్రిక ఎన్నికలు) ప్రజలందరికీ అర్థమైంది" అని రాహుల్ విమర్శించారు."మా రాజకీయ వ్యవస్థలో ప్రేమ, గౌరవం, వినయం వంటివి లేవు. రాజకీయ నాయకులు కులమతాలు, భాషలు, రాష్ట్రాలకు అతీతంగా అందరినీ ప్రేమించాలి. కేవలం శక్తిమంతులనే గాక, భారత్‌ను నిర్మించేందుకు ప్రయత్నించే అందరినీ గౌరవించాలి. వీటన్నిటిని రాజకీయాల్లో తిరిగి తీసుకొచ్చేందుకే నేను నిరంతరం పనిచేస్తున్నా" అని రాహుల్ గాంధీ వెల్లడించారు.

భాజపా అంటే భయం పోయింది..

ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల్లో భాజపా సొంతంగా మెజార్టీ దాటలేకపోయిన అంశాన్ని రాహుల్ పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆ పార్టీపై విమర్శలు గుప్పించారు. "మన సంప్రదాయాలు, భాషలపై భాజపా దాడి చేస్తోందని నాతో చాలా మంది చెప్పారు. ఆ పార్టీ ఎలాంటిదో వారు అర్థం చేసుకున్నారు. భాజపా, ప్రధాని అంటే ఇప్పుడు ఎవరూ భయపడట్లేదని ఎన్నికల ఫలితాలతోనే స్పష్టమైంది. రాజ్యాంగంపై దాడిని తాము ఎన్నటికీ అంగీకరించబోమని ప్రజలు స్పష్టంగా చెప్పారు" అని రాహుల్ అన్నారు. భారత్ జోడో యాత్ర తనను ఎంతగానో మార్చిందని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు. "ఆ యాత్ర తర్వాత నా ఆలోచనా విధానం కొత్తకోణంలోకి మారిపోయింది. ప్రజలతో కొత్త బంధాన్ని ఏర్పరిచింది. ఆ యాత్రతో భారత రాజకీయాల్లో ప్రేమ అనే కొత్త అధ్యాయాన్ని తీసుకొచ్చాం" అని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. అంతకుముందు డాలస్‌లోని టెక్సాస్ యూనివర్సిటీలో విద్యార్థులనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. భారత్, అమెరికా సహా కొన్ని పశ్చిమ దేశాలను నిరుద్యోగ సమస్య తీవ్రంగా వేధిస్తోందని, అదే సమయంలో చైనా మాత్రం ఆ ఇబ్బందిని ఎదుర్కోవట్లేదని తెలిపారు. ఉత్పత్తి రంగంలో డ్రాగన్ ఆధిపత్యమే ఇందుకు కారణమన్నారు. తయారీ రంగంపై భారత్ మరింత దృష్టిపెట్టాలన్నారు. కాగా.. గతంలోనూ భారత ప్రజాస్వామ్యం గురించి రాహుల్ విదేశీ గడ్డపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.

# భారీ వర్షాలతో తీవ్ర నష్టం

ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చివరి బాధితుని వరకు సహాయం అందిస్తామని ప్రకటించారు. భారీ వర్షాలు, వరదలకు రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని 33 జిల్లాలను వర్షాప్రభావిత జిల్లాలుగా ప్రకటించామని తెలిపారు.తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రిసలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్, వ్యవసాయ, పంచాయితీరాజ్, విద్యుత్, విద్య, రోడ్లు, హౌసింగ్, ఇరిగేషన్ అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఆయా శాఖలకు సంబంధించి ఎంత నష్టం జరిగింది, ఎన్ని నిధులు కావల్సిన అంశాలపై పకడ్బంధిగా అంచనా వేయాలని సూచించారు. కేంద్రానికి ప్రతిపాదించే నివేదికలలో పొందుపరచవలసిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తయారు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వరద ప్రాంతాలలో ఎనుమరేషన్ కూడా పక్కాగా జరగాలని సూచించారు. ఆయా శాఖల పరంగా జరిగిన నష్టాన్ని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. భారీ వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 33 మంది మృతి చెందారని ఇందులో ప్రధానంగా ఖమ్మంలో 6 మంది, కొత్తగూడెంలో 5 మంది, ములుగులో 4 మంది, కామారెడ్డిలో ముగ్గురు, వనపర్తిలో ముగ్గురు చనిపోయారని అధికారులు మంత్రికి వివరించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని కూడా అందచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వరదల వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఇండ్లు పూర్తిగా పాక్షికంగా కూలిపోయాయి. వీటిని వెంటనే గుర్తించి బాధితులకు రూ. 5 లక్షల రూపాయలతో ఉచితంగా ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వర్షాలలో దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.16,500 చొప్పున సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా వరద సహాయం పూర్తిగా ఆ÷-లనైన్ ద్వారానే బాధితుల అక్కౌంట్లోకి జమ చేస్తున్నామని వెల్లడించారు. వరద సమయంలో గౌరవ ముఖ్యమంత్రి వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించినప్పుడు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారని, అయితే జరిగిన నష్టాన్ని చూసి మానవతా ధృక్పథంతో రూ.16,500 కి పెంచినట్టు వెల్లడించారు. ఈ



సహాయాన్ని ఈరోజు నుంచే బాధితులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం లక్షలాది ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు మంత్రిగారికి తెలిపారు. వరద ముప్పుకు గురైన ప్రతి ఎకరానికి రూ.పదివేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. దాదాపు తెలంగాణ వ్యాప్తంగా 358 గ్రామాలు వరద ముప్పుకు గురి కాగా, దాదాపు 2 లక్షల మంది ప్రభావితం అయినట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం 158 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందస్తు చర్యల వల్ల 2,454 మందిని రక్షించామని తెలిపారు. 13,494 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో ఆర్/బి, పంచాయితీరాజ్ విభాగాలకు సంబంధించి వేలాది కిలోమీటర్ల రహదారులు దెబ్బ తిన్నాయని, గ్రామీణ మారుమూల ప్రాంతాలలో ఇప్పటికే తాత్కాలిక మరమత్తులు చేపట్టి కొన్ని రోడ్లను పునరుద్ధరించామని శాశ్వత ప్రతిపాదికన మరమత్తులు చేపట్టడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రెండు మూడు రోజుల్లో తయారు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన మరమత్తులను శాశ్వత ప్రతిపాదికన చేపట్టాలని సూచించారు. తాత్కాలిక మరమత్తులతో ఆశించిన ప్రయోజనం ఉండకపోవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. అంగన్వాడీ, ప్రభుత్వ ఆసుపత్రులు, పాటశాలలు, ప్రాథమిక హెల్త్ సెంటర్లు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న వివరాలను 24 గంటల్లో సచివాలయంలోని ఆయా విభాగాలకు పంపించాలని కలెక్టర్లను ఆదేశించారు.ఃారీ వర్షాలు, వరదలకు చాలా ఇండ్లల్లోకి నీరు చేరి ఇంటి యజమాని భూ పత్రాలు, ఆస్తి పత్రాలు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డులతో పాటు విలువైన పత్రాలు తడిచి పోయాయి, కొట్టుకుపోయాయి. ఈ బాధితులందరూ స్థానికంగా ఉన్న పోలీసు స్టేషన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి ఆ డూప్లికేట్ పత్రాలను అందిస్తారని ఈ విషయంలో బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తడిసిన ధాన్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రతి గింజను కనీస మద్ధతు ధరకు కొనుగోలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. వ్యర్థాలను ప్రభుత్వ భూముల్లో పోయడం వల్లనే సూర్యపేట, పాలేరుకు భారీగా నష్టం జరిగింది. ఆ వ్యర్థాలతో వరద నీరు పోవడానికి వీలు లేకుండా పోయింది. జరిగిన నష్టాన్ని ఆ ఏజెన్సీల నుంచే వసూలు చేయాలని మైనింగ్ అధికారులను ఆదేశించారు. రెండు ఏజెన్సీలు 18 లక్షల క్యూబిక్ మీటర్ల వ్యర్థాలను పోశారని అధికారులు వివరించారు.

## మూడు శాసనసభ ఆర్థిక కమిటీలకు ఛైర్మన్ల నియామకం
### పీఏసీ ఛైర్మన్‌గా అరికపూడి గాంధీ

హైదరాబాద్, (ప్రజా మంటలు):

2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర శాసనసభ మొత్తం మూడు ఆర్థిక కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఇవాళ అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక పబ్లిక్ అకౌంట్స్ కమిటీకి ఛైర్మన్‌గా ఎమ్మెల్యే అరికపూడి గాంధీ నియమితులయ్యారు. మిగిలిన రెండు కమిటీలకు గానూ ఛైర్మన్లను నియమించారు. అలానే మూడు కమిటీల్లోనూ మొత్తం 12 మంది చొప్పున సభ్యులుగా ఉండనున్నారు. కాగా పీఏసీ ఛైర్మన్? నియామకంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్రంగా మండిపడింది. ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ ఛైర్మన్ హోదాను, పార్టీ మారిన ఎమ్మెల్యేకు కట్టబెట్టడం ఎక్కడి సంస్కృతి అంటూ ధ్వజమెత్తింది.తెలంగాణ శాసనసభ ఆర్థిక కమిటీలు ఏర్పాటయ్యాయి. అందులో ప్రజాపద్దుల సంఘం, అంచనాల కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల సమితిలకు ఛైర్మన్‌లను, సభ్యులను నియమిస్తూ శాసనసభ కార్యదర్శి నర్సింహాచారి ప్రకటన జారీ చేశారు. ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్‌గా ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ నియామకం కాగా సభ్యులుగా ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, రేవూరి ప్రకాశ్? రెడ్డి, చిక్కుడు వంశీ కృష్ణ, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, రామారావు పవర్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కూనంనేని సాంబశివరాలు, బాను ప్రసాద్ రావు, ఎల్ రమణ, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే జీవన్ రెడ్డిలు నియమితులయ్యారు.అదేవిధంగా కోదాడ ఎమ్మెల్యే నలమడ పద్మావతి రెడ్డి అంచనాల కమిటీ ఛైర్ పర్సన్‌గా, సభ్యులుగా వాకిటి సునీతా లక్ష్మారెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాగంటి గోపి, విజయరమణ రావు, రామదాస్ మాలోత్, మామిడాల యశశ్విని రెడ్డి, రాకేశ్? రెడ్డి, ఎంఎస్ ప్రభాకర్ రావు, సుంకరి రాజు, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, యాదవ్ రెడ్డిలు ఉన్నారు. ఈర్లపల్లి శంకరయ్య ప్రభుత్వ రంగ సంస్థల సమితి ఛైర్మన్‌గా అపాయింట్? అవ్వగా సభ్యులుగా సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద్, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, సంజీవ్ రెడ్డి, లక్ష్మి కాంతరావు, కౌసిర్ మెహిద్దీన్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, సేరి శుభాస్ రెడ్డి, టాటా మధుసూదన్, మిర్జా రియాజుల్ హసన్‌లు ఉన్నారు.కాగా పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా అరికెపూడి గాంధీని నియమించడంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా మండిపడింది.

## త్వరితగతిన గ్రీన్‌ఫార్మాసిటీ

**- పనులు వేగవంతం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**

మహబూబ్?నగర్? జిల్లాల పరిధిలో ముచ్చర్ల ప్రాంతంలో ఇప్పటికే ఎంపిక చేసిన పరిసరాల్లో గ్రీన్ ఫార్మా సిటీని అద్భుతంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. పర్యావరణ హితంగా కాలుష్య రహితంగా ఉండేలా గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిశ్రమల అభివృద్ధి జరగాలనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. అక్కడ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీలు, తదితర మౌలిక సదుపాయాల నిర్మాణాలను వీలైనంత తొందరగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని, వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని పనులు చేయాలని సూచించారు. గ్రీన్ ఫార్మా సిటీలో పెట్టుబడులకు ఇప్పటికే పేరొందిన ఫార్మా కంపెనీలు ముందుకు వస్తున్నాయని, త్వరలోనే ఆ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతామని సీఎం తెలిపారు. ఔషధాల తయారీ కంపెనీలు, బయోటెక్ ఒ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు కొత్తగా నెలకొల్పే అత్యాధునిక గ్రీన్ ఫార్మా సిటీ సింగిల్ స్టాప్ గా ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. యాంటీ బయాటిక్స్, ఫెర్మంటేషన్ ఉత్పత్తులు, సింథటిక్ డ్రగ్స్, రసాయనాలు, విటమిన్లు, వ్యాక్సిన్లు, డ్రగ్ ఫార్ములేషన్స్, న్యూట్రాస్యూటికల్స్, హెర్బల్ ఔషధ ఉత్పత్తులు, ప్రత్యేక రసాయనాలు, కాస్మోటిక్స్ తదితర సంబంధిత ఉత్పత్తులన్నింటికీ ఫార్మా సిటీలో ప్రాధాన్యముంటుందని చెప్పారు. వీటితో పాటు పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని అన్నారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వ విద్యాలయం ఉంటుందని అన్నారు. హెల్త్ కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని సూచించారు.

## చేనేత కార్మికులను రుణవిముక్తులను చేస్తాం

తెలుగు యూనివర్శిటీలో ఐఐహెచ్‌టీలో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది ఐఐహెచ్‌టీని స్కిల్ యూనివర్సిటీకి తరలిస్తామని చెప్పారు. ఒక్కో విద్యార్థికి నెలకు 2500 స్టైఫండ్ ఇస్తామని హామీ ఇచ్చారు.గతంలో సినీ తళుకు బెళుకులు కూడా చేనేతకి తెచ్చారు. కానీ నేతన్నల రాత మారలేదు. గతంలో సిరిసిల్లలో కార్మికులకు బకాయిలు పెట్టారు. ఆ మొత్తం మేము అధికారంలోకి వచ్చాక విడుదల చేశాం. బతుకమ్మ చీరలకు కట్టుకునే స్థాయిలో నాణ్యత లేవు. మంచి డిజైన్‌తో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు ఒక్కొక్కరి ఏడాదికి 2 చీరలు ఇస్తాం. బతుకమ్మ చీరలు ఆగిపోయాయని ఆలోంచాల్సిన అవసరం లేదు అని రేవంత్ రెడ్డి అన్నారు. నేతన్నలకు రుణమాఫీ ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రుణమాఫీకి ఇప్పుడే ఆదేశాలు ఇస్తున్నామని అన్నారు. ' మీ సమస్యల పరిష్కారానికి మీ అన్నగా ఎప్పుడు ముందు ఉంటా. కొడంగల్ నియోజక వర్గంలోని నేతన్నలతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. నేతన్న కొండా లక్ష్మణ్ బాపూజీ వారసులు. త్యాగాలు చేస్తే ఎలా వేలాది కోట్ల ఆస్తులు సంపాదించారు. పదవిని తృణప్రాయంగా త్యాగం చేసింది కొండా లక్ష్మణ్ బాపూజీ' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. కేసీఆర్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ నిలువ నీడ ఇచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. నాంపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని వర్చువల్‌గా ప్రారంభించారు. లలిత కళాతోరణంలో ఇందుకు సంబంధించిన ప్రారంభోత్సవం నిర్వహించారు. చేనేత అభయహస్తం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కార్యాలయం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ స్థలం ఇచ్చారన్నారు. తెలంగాణ కోసం పదవులను తృణప్రాయంగా వదులుకున్నారని చెప్పారు. కానీ కొంత మంది రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలు, ఉపఎన్నికలు తెచ్చారన్నారు. ఆ ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లు చేసి త్యాగమని చెప్పుకొంటున్నారని విమర్శించారు. గజ్వేల్‌లో ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కేసీఆర్, కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలకు తేడా గమనించాలన్నారు. ఉప ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లతో బాగుపడిందెవరో ప్రజలకు తెలుసన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ఎప్పుడూ గుర్తిస్తుందని చెప్పారు. ఐఐహెచ్‌టీకీ కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకుందామన్నారు. ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలని ప్రధాని, కేంద్రమంత్రులను కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వారు రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి తక్షణమే మంజూరు చేశారని చెప్పారు. నాంపల్లి తెలుగు వర్సిటీలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేనేతల జీవన విధానంలో మార్పులు రాలేదు. సిరిసిల్ల నేతన్నలకు బకాయిలు చెల్లించలేదు. కాంగ్రెస్ వచ్చాక వెంటనే వాటిని విడుదల చేశాం. 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా 2 చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. చేనేతల రుణభారం రూ.30 కోట్లు తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కుల, చేతి వృత్తులకు సముచిత న్యాయం చేస్తాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. నైపుణ్యం గల చేనేత కళాకారులు, నూతన ఆవిష్కర్తల కోసం ఐఐహెచ్‌టీ ప్రారంభించారు. చేనేత రంగంలో ఆవిష్కర్తల ప్రోత్సాహానికి ప్రత్యేక కోర్సులు, శిక్షణ కార్యక్రమాలను ఇక్కడ అందించనున్నారు. అధునాతన పరిశోధన అవకాశాలను ఈ సంస్థ కల్పించనుంది. ఏటా 60 మందికి టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిఎ÷-లొమా కోర్సులు ఇవ్వనున్నారు. రైతన్న, నేతన్నలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. చేనేత సమస్యలకు సాంకేతికతే ముఖ్య కారణం. చేనేత ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతులు కావాలి. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. మన పిల్లలకు మన నైపుణ్యం అందించేందుకు ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తాం. అతి తక్కువ సమయంలో కేవలం 10 రోజుల్లోనే ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేశాం. ప్రస్తుతానికి ఐఐహెచ్‌టీ తరగతులు తెలుగు వర్సిటీలో అందిస్తున్నాం. త్వరలో ఐఐహెచ్‌టీని స్కిల్ వర్శిటీకి తరలింపు. నేతన్నల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి. చిన్న వయస్సులోనే రేవంత్ సీఎం అయ్యారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలని కృషి చేస్తున్నారని అన్నారు.

# ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపాలి

## జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్..

జగిత్యాల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు సత్వర పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్ రెడ్డి లతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 61 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్ రెడ్డి, జగిత్యాల, మెట్ పల్లి ఆర్డిఒలు, మధు సుధన్, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంతరావు, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు ప్రారంభం

జగిత్యాల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :

జిల్లాలోని "మహిళా అబివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో "పోషణ అభియాన్ పథకం ద్వారా గ్రామా స్థాయి ,మండల స్థాయి ,జిల్లా స్థాయిలలో పోషణ్ అభియాన్ పై పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది .ఇందులో బాగంగానే ఈ సంవత్సరం సెప్టెంబరు నెల మొత్తం 7 వ రాష్ట్రీయ పోషణ మాసం 2024 (పోషణ మాసోత్సవాలు) లో నాలుగు ముఖ్యమైన అంశాల పై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పోషణ మాసం యొక్క కార్యక్రమాల ప్రణాళిక గురించి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమములో మొదటగా జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బి నరేష్ మట్లాడుతూ పిల్లల్లో లోప పోషణను నివారించి,పోషణ స్థాయిని పెంపొందించుటకు, మహిళల్లో రక్త హినతను నివారించుటనే లక్ష్యంగా పోషణ్ అభియాన్ పథకం ద్వారా పోషణ మాసం అనే ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ మాసంలో ఒకటవ తేదీ నుండి 30 తేదీ వరకు ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ద్వారా అంగన్వాడి స్థాయి నుండి గ్రామ మండల జిల్లా స్థాయిలో ప్రత్యేకమైన కార్యక్రమాలు చేయడం జరుగుతుందని చెప్పారు. పోషణ మాసం కార్యక్రమాల ప్రణాలికను నాలుగు వారాలుగా చేయడం జరిగిందని అందులో ముఖ్యంగా 1. గ్రామస్థాయి ఆరోగ్య,పారిశుద్ధ మరియు పోషణ దినం' ( వి హెచ్ ఎస్ఎన్ డి) తో పాటు పిల్లల్లో పెరుగుదల పర్యవేక్షణ. 2. పోషణ్ బి పడాయి బి' మరియు రక్తహీనత అనే అంశాలపై కార్యక్రమం. 3. పిల్లలకు పరిపూరకమైన ఆహారం అందించడం' పోషక ఆహారం పద్ధతులు,హ్యాండ్ వాష్ పద్ధతుల పైన అవగాహన కలిగించడం 4. సాంకేతిక అంశాలు, పర్యవేక్షణ మరియు పర్యావరణ రక్షణ,భద్రత కలిగించడం అనే అంశాలపై కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలియచేసారు. అంతేకాకుండా పిల్లల పెరుగుదల పర్యవేక్షణ మరియు పిల్లల మెదడు పెరుగుదల తెలుపుతూ పిల్లల యొక్క మొదటి వెయ్యి రోజుల ప్రాముఖ్యతను పిపిటి ప్రదర్శన ద్వారా వివరించారు. మరియు పిల్లకు పోషణ భి పాడాయి భి' అనే కార్యక్రమము ద్వారా పిల్లలకు ఆట పాట లతో కూడిన విద్యతో పాటు , పౌష్టికాహారం అందచేయడం జరుగుతుందని అన్నారు, ఈ సంవత్సరం నుండి అంగన్ వాడి కేంద్రాలను పూర్వ ప్రాథ మిక విద్య కేంద్రాలు గా ప్రభుత్వంచే గుర్తించబడ్డాయి అని దిని కోసం పిల్లలకు ప్రత్యకమైన పాఠ్యాంశాలను రూపొందించ బడ్డాయి అని అన్నారు,వీటి ద్వారా పిల్లలు శారీరక అభివృద్ధి తో పాటు మానసిక అభివృద్ధి కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. సమవేశానికి ముందు కలెక్టరేట్ నందు ఏర్పరిచిన ప్రత్యకమైన పోషక ఆహర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ చే ప్రారంబించారు,జిల్లా అధికారులతో పాటు పోషకాహార ప్రదర్శనను విక్షించారు. కలెక్టర్ బాల అమృతం చే తయారు చేయబడ్డ పోషక ఆహార పదార్థాల గురించి అడిగి తెలుసుకున్నారు,మరియు పోషణ మాస కార్యక్రమాల యొక్క పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ,అడిషనల్ కలెక్టర్లు రాంబాబు,గౌతం రెడ్డి , మరియు జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బి.నరేష్,సమస్త జిల్లా అధికారులు,మరియు సిడిపివో లు,ఐసిడియస్ సూపర్ వైజర్లు,పోషణ అభియాన్ సిబ్బంది,అంగన్ వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ మండలి నిర్వాహకులకు విద్యుత్ శాఖ నిబంధనలు సూచనలు



జగిత్యాల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) : విద్యుత్ శాఖా వారి నుండి విద్యుత్ కనెక్షన్ పొందడానికి గణేష్ మండలి నిర్వాహకులు వరి పూర్తి వివరాలను, వారి మొబైల్ నంబరుతో, కావాలిసిన లోడ్ వివరాలతో సహా ఇవ్వాలని కోరారు. తమ ప్రాంత సిబ్బంది/ అధికారులకు వివరాలు ఇచ్చినచో, గణేష్ మండపాలకు పోల్ నుండి కనెక్షన్ ఇస్తారని అధికారులు తెలిపారు. దగ్గర ఉండే కరెంట్ వైరలకు కొండిలు వెయ్య రాదు. దాని మూలన షార్ట్ సర్క్యూట్ అయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. కొని సందర్భాల్లో ప్రాణ నష్టం జరగవచ్చు.

# సీనియర్ జర్నలిస్ట్ హింగే అశోక్ మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వోడితల సతీష్ కుమార్



ఎల్కతుర్తి సెప్టెంబర్ 0 9 (ప్రజా మంటలు) :

ఎల్కతుర్తి మండల కేంద్రం లోని చింతలపల్లి గ్రామానికి చెందిన పాత్రికేయులు హింగే అశోక్ హఠాత్ మరణం పట్ల హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందరితో కలిసి మెలిసి ఉండే మంచి మనస్తత్వం పాత్రికేయ వృత్తికి సరియైన నిర్వచనం అశోక్ అన్నారు ఆయన మరణం వారి కుటుంబ సభ్యులకు తీరని లోటు అని ప్రగాఢ సంతాపం తెలిపారు వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ రైల్వే బోర్డు సభ్యులు యేల్తూరీ స్వామి సింగిల్ విండో వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగెడ మహేందర్ మాజీ మండల అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి మాజీ ఎంపీపీ మేకల స్వప్న మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ మాజీ ఎంపిటీసీల ఫోరం మండల అధ్యక్షులు కడారి రాజు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొల్లె మహేందర్ బిఆర్ఎస్వి నియోజకవర్గ ఉపాధ్యక్షులు గోడిశాల వినయ్ గౌడ్ సోషల్ మీడియా ఎల్కతుర్తి మండల అధ్యక్షులు గుండేటి సతీష్ యూత్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి సీనియర్ నాయకులు గుండా ప్రతాప్ రెడ్డి మదన్మోహన్రావు సాంబమూర్తి గౌడ్ సాతూరి చంద్రమౌళి ప్రదీప్ బాబు వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళా నాయకులు యూత్ నాయకులు సంతాపం తెలిపారు.

# గణనాథుని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యేరవిశంకర్

కొడిమ్యాల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) : జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండల కేంద్రంలోని సాయి నగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్దకు నిర్వాహకులు చిట్టాలపల్లి సాయి, కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే హాజరై గణనాధుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు యువకులను మహిళలను భక్తులందరినీ పలకరిస్తూ అందరితో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు.వారి వెంట బొరాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, యువజన సంఘం మండల అధ్యక్షులు గడ్డం లక్ష్మారెడ్డి, పద్మశాలి, గ్రామైక్య సంఘం అధ్యక్షులు అంకం రాజేశం, %దీ=హా% పట్టణ అధ్యక్షులు కొత్తూరి స్వామి, బొరాస నాయకులు పర్లపల్లి ప్రభుదాస్, బైరి వెంకటి, సుకూర్,సల్మాన్, దీకొండ చంద్రశేఖర్, రాచకొండ చంద్రమోహన్,మొగిలి రాకేష్,కంచర్ల మనోజ్,నరసయ్య,వివిధ పార్టీల నాయకులు పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# ఏకేవీఆర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 09 (ప్రజామంటలు) :

మండలంలోని ముల్కనూరు ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్ మాట్లాడుతూ, కాళోజి నారాయణరావు తన సాహిత్యం ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేశారని కొనియాడారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతిని తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు గుంటి ఓదెలు, సుప్రియ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మెటుపల్లిలో కాళోజీ జయంతి

మెటుపల్లి సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి ఘనంగా నిర్వహించారు, ఆయన తెలంగాణ అస్తిత్వం, భాష,యాస సంస్కృతి కొరకు నిరంతరంగా పోరాడిన వీరుడని కీర్తించారు.. అందుకే తెలంగాణ స్ఫూర్తి గా నిలిచాడు. ఇందులో బార్ ప్రెసిడెంట్ పి. లింబాద్రి, వైస్ ప్రెసిడెంట్ రాంబాబు కార్యదర్శి వేణు, న్యాయవాదులు వెంకటనర్సయ్య, తుల రాజేందర్, వెంకట్ స్వామి, రమేష్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





# నిబద్ధతకు పెట్టిన పేరు

- కార్యకర్త నుండి పీసీసీ చీఫ్ గా మహేష్ కుమార్ గౌడ్
- పీసీసీ చీఫ్ పట్ల హర్షం వ్యక్తం చేసిన ప్రవాస భారతీయులు మర్రి రాజ్ రెడ్డి



ఇల్లందకుంట సెప్టెంబర్ 09 (ప్రజామంటలు) : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పీసీసీ చీఫ్ గా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఎన్నిక కావడం పట్ల ఆస్ట్రేలియా ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాలో భారతీయులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లికి చెందిన మర్రి రాజ్ రెడ్డి (ఆస్ట్రేలియా) మాట్లాడుతూ, పార్టీ పట్ల నిబద్ధతతో పని చేసిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా అవకాశం రావడం సంతోషంగా వుందని అన్నారు. మహేష్ కుమార్ గౌడ్ పై నమ్మకంతో పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చిన ఖర్గే, సోనియా, రాహుల్, వేణు గోపాల్, సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో రానున్న రోజుల్లో జరగనున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎగరవేస్తామని అన్నారు.

# ఆదర్శ పాఠశాలలో కాళోజి జయంతి వేడుక

గొల్లపెల్లి సెప్టెంబర్ 09 (ప్రజామంటలు) : గొల్లపల్లి మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో కాళోజి జయంతిని పురస్కరించుకొని తెలంగాణ మాండలిక భాష దినోత్సవాన్ని నిర్వహించుకోవడం అందులో భాగంగా విద్యార్థిని ,విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, పద్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు ప్రిన్సిపల్ ఈరవేణి రాజకుమార్ , వైస్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అందరూ కాళోజి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉపన్యాసిస్తూ తెలంగాణ అస్తిత్వం కోసం జీవితాన్ని అర్పించిన కాళోజి నారాయణరావు గారి గురించి విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సమావేశాన్ని చక్కగా నిర్వహించేందుకు తెలుగు శాఖ ఉపాధ్యాయులను అభినందించారు.



# కోరుట్ల లో సి.ప్రభాకర్ స్మారక భవనంలో కాళోజీ జయంతి

కోరుట్ల సెప్టెంబర్ 09 (ప్రజామంటలు) : ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకులు సి.ప్రభాకర్ స్మారక భవనంలో కాళోజీ జయంతి ఘనంగా నిర్వహించారు. సమావేశంలో ప్రసంగిస్తూ, డా.తుల రాజేందర్, న్యాయవాదులు చన్న విశ్వనాథ్ లు ప్రసంగించారు. ఒ.శేఖర్, బ ది నర్సయ్య, వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రాచకొండ దేవయ్య, నాగేశ్వరరావు, గుర్రం గంగా మనీ అనా %ం%పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత రాస భూమయ్య అధ్యక్షత వహించారు.



## బుగ్గారంలో "డిటోనేటర్ల" (బాంబుల) గోదాం వద్దే వద్దు

ప్రాణాంతకమైన ఈ బాంబుల గోదాం నిర్మాణం వలన ప్రజలకు, వన్యప్రాణులకు, పర్యావరణానికి తీరని నష్టం కలిగే ప్రమాదాలు పొంచి ఉన్నాయని వారు వివరించారు.

ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే పనులు చేయనీయం :

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ

బుగ్గారం విడిసి, ఎండీసి ల అధ్వర్యంలో వినతి పత్రాలు అందుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ప్రజలకు, పర్యావరణానికి, వన్య ప్రాణులకు నష్టం కలిగించే పనులు గానీ, ప్రాణ హాని తలపెట్టే పనులు గానీ నియోజక వర్గంలో ఎక్కడా కూడా చేయనీయమని హామీ ఇచ్చారు.

సంబంధిత అన్ని శాఖల అధికారులతో మాట్లాడి ఇట్లాంటి ప్రాంతకమైన పనులకు ఎలాంటి అనుమతులు జారీ చేయకుండా చూస్తానని బుగ్గారం ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజా క్షేమమే తన లక్ష్యమని – నియోజక వర్గంలో ఆయా గ్రామాల ప్రజల అభీష్టం మేరకే పనులు చేస్తూ, పాలన కొనసాగిస్తామని అభయ మిచ్చారు. లక్ష్మణ్ కుమార్ హామీతో బుగ్గారం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ లక్ష్మణ్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు.

విడిసి కోర్ కమిటీ చైర్మన్ అయిన తెలంగాణ జన సమితి పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటి అధ్యక్షులు నక్క చంద్రమౌళి, మాజీ సర్పంచ్ మసర్తి రాజిరెడ్డి, ఎండీసి కో – కన్వీనర్ అయిన మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పెద్దనవేణి రాగన్న, బుగ్గారం పోచమ్మ ఆలయాల కమిటి చైర్మన్ మసర్తి నర్సయ్య, మున్నూరు కాపు సంఘం  అధ్యక్షులు పొలంపెల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శి కూతురు పోచమల్లు, మసర్తి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒక జర్నలిస్టుకి రెండు మూడు ప్రాంతాల్లో ఇండ్ల జాగలు ఇస్తారా?

### కొందరు బడా జర్నలిస్టులు అనేక చోట్ల లబ్ధి పొందినట్లుగా ఆరోపణలు

### సీఎం రేవంత్ సార్..విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి

(మానసాని కృష్ణరెడ్డి సీనియర్ జర్నలిస్ట్)



జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఇళ్ల పట్టాలను జర్నలిస్టులకు పంపిణీ చేశారు.వర్కింగ్ జర్నలిస్టులందరికి ఎలాంటి వివక్షత లేకుండా, చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అన్ని ప్రభుత్వ పథకాలను వర్తింపచేయాల్సిందే.వారికి ఇండ్ల జాగలు ఇవ్వాల్సిందే.ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఇండ్ల జాగల పట్టాలను ఇవ్వడం అభినందించాల్సిందే.ఇందులో రెండో అంశానికి తావు లేదు.అయితే ఒక జర్నలిస్టుకు ఒకసారి మాత్రమే ఇండ్ల జాగలు ఇవ్వాలి.ఇది సహజ ధర్మం.అయితే ఇప్పటికే కొంతమంది రెండు మూడు ప్రదేశాల్లో ఇండ్ల స్థలాలు తీసుకుని ఇప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ ద్వారా ఇండ్ల పట్టాలను పొందినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.కొన్ని జిల్లాలో ఇప్పటికే ఇండ్ల జాగలు తీసుకుని లబ్ధి పొందిన వారు ఇప్పుడు మళ్లీ ఈ హౌజింగ్ సొసైటీ ద్వారా ఇండ్ల పట్టాలు పొందినట్లుగా కొన్ని ఆరోపణలు రావడం మరి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్ళిందా ? లేక ఆయనకు తెలియకుండానే ఈ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేశారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.కొందరు బడా జర్నలిస్టుల ముసుగులో అటు జిల్లాల్లో లబ్ధి పొంది ఇప్పుడు రాజధానిలో కూడా ఇండ్ల జాగలు దక్కించుకున్నట్లుగా గుసగుసలు విన్పిస్తున్నాయి.వీటన్నింటిపైన సమగ్ర దర్యాప్తు జరిపితే నిజానిజాలు తేలుతాయని అంటున్నారు.అలాగే ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేసిన జర్నలిస్టుల ఇండ్ల జాగలపైన కూడా వివాదం నెలకొన్నదనే సమాచారం ఉన్నది.ఈ జాగ తమ పట్టా భూమి అని కొందరు న్యాయస్థానాలను తాజాగా ఆశ్రయించినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఓ రాష్ట్ర సీఎం పంపిణీ చేసిన జాగ వివాదాస్పద స్థలం కావడంపైన విస్మయం వ్యక్తమవుతోంది.అదేవిధంగా హైదరాబాద్‌లో ఇండ్ల జాగలు పొందిన జర్నలిస్టుల్లో అధిక శాతం పక్కరాష్ట్ర పాత్రికేయులేననే ప్రచారం కూడా ఉన్నది. ఓ వర్గ లాబీమేరకే ప్రభుత్వం ఈ విషయంలో ముందుపడి కార్యక్రమాన్ని పూర్తి చేసిందని అంటున్నారు.అయితే రాష్ట్రవ్యాప్తంగా ఎందరో జర్నలిస్టులు ఎలాంటి ప్రభుత్వ పథకాలకు అర్హులు కాకుండా, ఇండ్ల జాగలు పొందకుండా ఉన్నారు.ఎన్నో యేండ్లుగా వర్కింగ్ జర్నలిస్టులుగా ఉన్నా ఇప్పటి వరకు ప్రభుత్వాలు పట్టించుకోలేదని,కానీ కొందరు మాత్రం రెండు మూడు ప్రాంతాల్లో ఇండ్ల జాగలు దక్కించుకోగలిగారని ఇదెక్కడి న్యాయం అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి నిష్పక్షపాతంగా విచారణ చేపడితే అన్ని వ్యవహారాలు బయటపడతాయాని పలువురు జర్నలిస్టులు అంటున్నారు.మరి నిజమైన జర్నలిస్టులకు న్యాయం చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అని జర్నలిస్టు సర్కిల్‌లో చర్చ నడుస్తోంది.

# తెలంగాణకు నిధుల కేటాయింపులో వివక్ష

## - నిధుల విభజనలో కొలమానాలు మారాలి

## - 16వ ఆర్థిక సంఘం ముందు హరీశ్  వాదనలు

హైదరాబాద్ (ప్రజామంటలు):

తలసరి ఆదాయం ఉన్న తెలంగాణకు అన్యాయం జరుగు తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రాలకు నిధుల విభజనలో ప్రస్తుత కొలమానాలు మారాలని 16వ ఆర్థిక సంఘానికి సూచించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ఆర్థిక సంఘం చైర్మన్ బనగారియా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం సోమవారం ప్రజాభవన్‌లో పలు రాజకీయ పార్టీలు, స్థానిక సంస్థలు, వ్యాపార వాణిజ్య సంస్థల ప్రతినిధులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ తరపున హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కేపీ వివేకానంద హాజరయ్యారు. తొలి రోజు 16వ ఆర్థిక సంఘం ముగిసిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.16వ ఆర్థిక సంఘానికి బీఆర్ఎస్ తరపున పలు ప్రతిపాదనలు చేసినట్లు హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రాలకు నిధుల విభజనలో ప్రస్తుత కొలమానాలు మారాలని సూచించామని అన్నారు.  బాగున్న రాష్ట్రానికి తక్కువ నిధులు వచ్చేలా ప్రస్తుత విధానం ఉంది. మంచి పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోంది. అత్యధిక తలసరి ఆదాయం ఉన్న తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. బాగా పని చేస్తున్న రాష్ట్రాన్ని ప్రోత్సహించే విధానాలు ఉండాలి. పన్నుల వాటా కేటాయింపులో కేంద్రం పాటిస్తున్న విధానాలు సరిగా లేవు. పట్టణీకరణ పెరుగుతున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు నష్టం జరుగుతోంది. తెలంగాణలో ఎత్తిపోతల పథకాలు మాత్రమే సాధ్యమవుతాయి. ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం తప్పకుండా నిధులు ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పన్నుల వాటా కేటాయింపులో కేంద్రం పాటిస్తున్న విధానాలు సరిగా లేవన్నారు. ఇంటింటికి నీరు కోసం కేంద్రం హర్ ఘర్ జల్ పథకాన్ని తీసుకొచ్చింది. కానీ, దాన్ని రాష్ట్రంలో మిషన్ భగీరథ రూపంలో గతంలోనే అమలు చేశాం. మిషన్ భగీరథ పథకానికి నిధులు ఇవ్వాలని నీతి ఆయోగ్ చెప్పినా నిధులు ఇవ్వలేదు. 15వ ఆర్థిక సంఘం సూచనల్లో ఒక్కదాన్ని కూడా కేంద్రం పాటించలేదు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షపూరితంగా వ్యవహరి స్తోందని విమర్శించారు.

## బొట్టు నిజం మెరిసినా..

రాత్రిలా  చీకటి పడి
వెలుతురులో తడవకుండా
నచ్చిన చోట ఇంకిపో

దొరికిన ఇష్టాలను
ఏరుకుని
మనసు మాళిగలో దాచి

నేనున్న వైపుకి ప్రవహించి
ఎంతో ఎత్తైన
నా లోతులో మునిగి

విశాలమైన హృదయంలో
తేలే కలలో
వెచ్చగా ఓ తీరాన్ని కప్పుకో...

కోట్ల ఇసుక రేణువుల్లో
బొట్టు నిజమై మెరిసినా
అది సంద్రమంత ప్రేమకు
సాక్ష్యమే ....

శ్రీ సాహితి
9704437247

## భాజపా కార్యాలయమే నిందితుల తొలి లక్ష్యం

### - రామేశ్వరం కేఫ్‌లో ఘటనలో ఎన్ఐఏ తొలి ఛార్జిషీట్

దిల్లీ (ప్రజామంటలు):

బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు ఘటనపై ఎన్ఐఏ ఛార్జిషీట్‌లో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. నలుగురిని నిందితులుగా పేర్కొన్న ఎన్ఐఏ.. ఈ ముష్కరుల తొలి టార్గెట్ బెంగళూరులోని మల్లేశ్వరంలో ఉన్న భాజపా కార్యాలయాన్ని పేల్చడమేనని వెల్లడించింది. అయోధ్యలో రాముడి విగ్రహం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం రోజే భాజపా కార్యాలయంపై ఐఈడీ దాడికి విఫలయత్నం చేసినట్లు తెలిపింది. ఆ తర్వాతే రామేశ్వరం కేఫ్ పేలుడుకు ప్లాన్ చేశారని తెలిపింది. బెంగళూరు ఎన్ఐఏ కోర్టుకు సమర్పించిన ఛార్జిషీట్‌లో ఈ అంశాలను ప్రస్తావించింది. రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో ముస్సావిర్ హుస్సేన్ షాజిబ్, అబ్దుల్ మథీన్ అహ్మద్ తాహా, మాజ్ మునీర్ అహ్మద్, ముజామ్మిల్ షరీఫ్‌లను నిందితులుగా చేర్చింది. వీరిలో షాజీబ్, తాహాలు ఐసిస్ రాడికల్స్ అని తెలిపింది. ఈ దాడుల కోసం డార్క్ వెబ్ నుంచి డౌన్‌లోడ్ చేసిన భారత్, బంగ్లాదేశ్ గుర్తింపు కార్డులను ఉపయోగించినట్లు గుర్తించింది. ఇప్పటికే అరెస్టయిన ఈ నలుగురూ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నట్లు తెలిపింది.మార్చి 1న బెంగళూరులోని ప్రఖ్యాత రామేశ్వరం కేఫ్‌లో బాంబు దాడి జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. మార్చి 3న ఈ కేసు దర్యాప్తు ప్రారంభించిన ఎన్ఐఏ.. వివిధ రాష్ట్రాల పోలీసు బలగాలు, ఇతర ఏజెన్సీల సమన్వయంతో ముమ్మరంగా దర్యాప్తు కొనసాగించింది. ఇందుకోసం పలు సాంకేతిక, క్షేత్రస్థాయి పరిశోధనలు సైతం నిర్వహించింది. షాజీబ్ అనే నిందితుడు బాంబును అమర్చాడని విచారణలో వెల్లడైందని వెల్లడించింది. కర్ణాటకలో టార్గెట్ హత్యలు, ఇతర జిహాదీ కార్యకలాపాలకు సంబంధించిన కుట్రలు 2020లో భగ్నం కావడంతో తాహాతో కలిసి షాజీబ్ పరారయ్యాడని తెలిపింది. రామేశ్వరం కేఫ్‌లో పేలుడు ఘటన జరిగి 42 రోజుల తర్వాత పశ్చిమ బెంగాల్‌లో దాక్కున్న ఈ నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## వ్యాసకర్తలకు వినతి

**రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.**

mantalukathalu@gmail.com

-ఎడిటర్

## ధర్మాచరణ ముఖ్యం

తిరుపతి,సెప్టెంబర్7(ప్రజామంటలు):

మహాభారతంలోని ఉద్యోగ పర్వంలో సత్యం, ధర్మం తెలిసి కూడా ఆచరణలో పెట్టలేని కౌరవులకు మళ్లి ఒకసారి గుర్తు చేయడానికే కూర్చబడినట్టు పండితులు చెబుతారు. కృష్ణపరమాత్మ కౌరవ పాండవుల మధ్య సంధి చేయ కౌరవ సభకు వచ్చి యుద్ధం నివారించాలని చెబుతూ పాండవులు అయిదుగురికి ఐదు ఊర్లు ఇచ్చినా సంతృప్తిపడ తారని కౌరవులకు నచ్చజెప్ప ప్రయత్నించాడు. అయినా కౌరవులు పరమాత్ముని వచనాలు పెడచెవిన బెట్టడమేగాక కృష్ణ భగవాణున్ని సామాన్యునిగా భావించి బంధించ ప్రయత్నించారు. అసత్యపరులు అహంకారులు తనను తెలుసుకోలేని అజ్ఞానులని భావించిన భగవానుడు తన విశ్వ రూపాన్ని ప్రదర్శించి తనెవరో తెలియజేసాడు. ప్రస్తుత కాలంలో విజ్ఞానపరంగా మనం ఎంతో అభివృద్ధిని సాధించాం. సాధిస్తున్నాం కూడా!

# బెంగాల్ హత్యాచారం ఘటన.. కేసు సవాల్‌గా మారింది

### - ఆధారాలు చెరిపివేయడం వల్ల దర్యాప్తుపై ప్రభావం: సీబీఐ

### - వైద్యురాలి తల్లిదండ్రులకు లంచం ఆరోపణలు

### - తోసిపుచ్చిన సిఎం మమతా బెనర్జీ



కోల్‌కతా (ప్రజామంటలు):

పశ్చిమ బెంగాల్‌లో వెలుగు చూసిన ఘోర హత్యాచార ఘటన జరిగి సరిగ్గా నెల రోజులవుతోంది. తొలుత బెంగాల్ పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేయగా.. ఇప్పుడది సీబీఐ పరిధిలో ఉంది. కానీ ఇంతవరకు ఈ విచారణ ఒక కొలిక్కి రాలేదు. దర్యాప్తు సంస్థకు ఈ కేసు సవాల్‌గా మారిందని తెలుస్తోంది. దీనిపై సీబీఐ అధికారి ఒకరు మీడియాతో మాట్లాడారు. నేరం జరిగిన ప్రాంతంలో తగిన ఆధారాలు లభించకపోవడంతో, ఆ ప్రభావం దర్యాప్తుపై పడుతోందన్నారు. ఆ డాక్టర్ మృతదేహం దొరికిన మరుసటి రోజు సెమినార్ హాల్ సమీపంలో ఉన్న రెస్ట్‌రూం, టాయిలెట్‌ను కూల్చివేయాలని ఆర్జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ ఆదేశించినట్లు సీబీఐ గుర్తించింది. అప్పుడే కీలక ఆధారాలు మిస్ అయినట్లు తాము అనుమానిస్తున్నట్లు చెప్పారు.అలాగే మృతదేహాన్ని గుర్తించిన వెంటనే సెమినార్ హాల్ వద్ద భారీగా జనం గూమిగూడినట్టుగా ఉన్న ఒక వీడియో వైరల్ అయింది. ఈ ఘటనకు నిరసనగా ఆగస్టు 14న అర్ధరాత్రి చేపట్టిన ఆందోళన ఆసుపత్రిలో విధ్వంసానికి దారితీసింది. ఈ రెండు సందర్భాల్లో ఆధారాలు ధ్వంసమయ్యాయా..? అనే అనుమానాలు తలెత్తాయి. కానీ కోల్‌కతా పోలీసులు అలాంటిదేమీ జరగలేదని వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఈ ఘటనపై బాధితురాలి తల్లిదండ్రులు హైకోర్టులో వేసిన పిటిషన్‌లో.. గ్యాంగ్ రేప్ జరిగి ఉండొచ్చన్న అనుమానాలు లేవనెత్తారు. ఆధారాలు మొత్తం తారుమారయ్యాయని ఆరోపించారు.ఈ పరిణామాలన్నింటిని ఉద్దేశించి సీబీఐ అధికారి మాట్లాడుతూ.."ఈ కేసులో తగిన ఆధారాలు లేవు. అందుకే మా అధికారులు తొందరగా ఓ కొలిక్కి రాలేకపోతున్నారు. డీఎన్ఏ ఫలితం, ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, పలువురిని ప్రశ్నించిన మీదట లభించిన వివరాల ప్రకారం.. ఆ డాక్టర్‌పై జరిగిన దాడిలో ఒకరికి మించిన వ్యక్తుల ప్రమేయం లేదని వెల్లడైంది. ఘటనా స్థలంలో సేకరించిన నమూనాలు.. రాయ్ నమూనాలతో మ్యాచ్ అయ్యాయి" అని అన్నారు. ఇదిలా ఉండగా.. అసలైన నేరస్థుల కాపాడేందుకు సంజయ్‌ను ఇరికించారని అతడి తరఫు న్యాయవాది వాదిస్తున్న సంగతి తెలిసిందే.మరోవైపు, కేసు విచారణలో భాగంగా ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. దాంతో మాజీ ప్రిన్సిపల్ ఘోష్‌తో సహా మరో ముగ్గురిని సీబీఐ అరెస్టు చేసింది. ఈడీ కూడా ఈ అక్రమాలను విచారిస్తోంది. ఆర్జీ కర్ ఆసుపత్రిలోని సెమినార్ రూమ్‌లో ఆగస్టు 9న పీజీ వైద్య విద్యార్థి విగత జీవిగా కనిపించి ఉండటాన్ని గుర్తించారు. తొలుత ఆత్మహత్య చేసుకుందని అధికారులు చెప్పినప్పటికీ.. హత్యాచారమని దర్యాప్తులో గుర్తించారు.

**లంచం ఆరోపణలు తోసిపుచ్చిన సిఎం మమతా బెనర్జీ**

ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ట్రెయినీ వైద్యురాలి హత్యాచార ఘటనలో మృతురాలి తల్లిదండ్రులకు పోలీసులు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ వస్తున్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం కోల్‌కతాలో స్పందించారు. ఈ ఆరోపణలను ఆమె ఖండించారు.



ఇటువంటి పని తమ ప్రభుత్వం ఎప్పుడు చేయదన్నారు. తమ ప్రభుత్వంపై వెల్లువెత్తిన ఈ ఆరోపణల వెనుక కేంద్ర ప్రభుత్వ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. అందులో వామపక్ష పార్టీల ప్రమేయం సైతం ఉందని ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు.తమ కుమార్తె హత్యాచార ఘటన కేసులో తాము మౌనంగా ఉండేందుకు కోల్‌కతా పోలీసులు తమకు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ గత వారం మృతురాలి తండ్రి ఆరోపించారు. దీనిపై సీఎం మమతా బెనర్జీపై విధంగా స్పందించారు. చనిపోయిన వైద్యురాలి కుటుంబానికి తాను నగదు ఇవ్వాలని ప్రయత్నించలేదన్నారు. అయినా నగదు ఇవ్వడం ద్వారా ఆ కుటుంబానికి జరిగిన నష్టాన్ని మాత్రం పూడ్చలేమన్నారు. హత్యాచార ఘటనతో విగత జీవిగా మారిన 32 ఏళ్ల ట్రెయినీ వైద్యురాలు చిరస్థాయిగా నిలిచి ఉండేలా.. ఆమె స్మారకార్థం ఏదైనా చేయాల్సి ఉందని సీఎం మమతా స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం మృతురాలి కుటుంబ వైపునే ఉందని ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు.మరోవైపు ఈ వైద్యురాలి హత్యాచార ఘటన అనంతరం రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తాయని గుర్తు చేశారు ఆ సమయంలో కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ పదవికి రాజీనామా చేసేందుకు ఐపీఎస్ అధికారి వినీత్ గోయెల్ సిద్దపడ్డారన్నారు. కానీ మరికొద్ది రోజుల్లో కోల్‌కతా మహానగరంలో దసరా ఉత్సవాలు జరగ నున్నాయని.. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలపై అవగాహన ఉన్న వ్యక్తి ఆ పదవి నుంచి వైదొలిగితే ఎలా అని ఆయన్ని ప్రశ్నించానని సీఎం మమతా బెనర్జీ ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు.హత్యాచార ఘటన వెలుగులోకి వచ్చిన నాటి నుంచి పోలీసులు వ్యవహరించిన తీరుపై మృతురాలి తల్లిదండ్రులు తమ ఆక్రోశం వివిధ సందర్భాల్లో వెళ్లగక్కిన సంగతి తెలిసిందే. తమ కుమార్తె మృతదేహాన్ని చూసేందుకు ఆసుపత్రిలో మూడు గంటల పాటు వేచి చూడాల్సి రావడం.. మృతదేహాన్ని తమకు అప్పగించే సమయంలో ఓ సీనియర్ పోలీసు అధికారి నగదు తమకు ఇచ్చారని.. అయితే తాము దానిని తిరస్కరించామని మృతురాలి తండ్రి గత వారం ఆరోపించిన విషయం విధితమే.

# ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి కే ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలి

● రెడ్డి జేపీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్ రెడ్డి



హుజురాబాద్ సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) : ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఉటుకూరి నరేందర్ రెడ్డి కి ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలని రెడ్డి జేపీసీ విద్యార్థి విభాగం కర్రే శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో %జూ%రాభూత్వాన్ని కోరారు. సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అతను ప్రముఖ విద్యావేత్త అని జిల్లాలలో అన్ని వర్గాల వారితో, రాజకీయ నాయకులతో, తల్లిదండ్రులతో, పూర్వపు విద్యార్థులతో, అందులో పని చేసే ఉపాధ్యాయులతో మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ఏ ప్రభుత్వమైనా పటిష్టంగా ఉండాలంటే విద్య వైద్యం సామాన్యులకు అందుబాటులో ఉండాలనిఅతను అన్నారు. నరేందర్ రెడ్డి కి విద్యా వ్యవస్థ పై పూర్తిగా అవగాహన ఉంది కాబట్టి, కష్టకాలంలో కూడా పార్టీ కోసం పని చేశారని అని అన్నారు. నరేందర్ రెడ్డి కి టికెట్ ఇస్తే పార్టీలకు అతీతంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని అతను అన్నారు. నరేందర్ రెడ్డి కి టికెట్ కేటాయిస్తే యువత కూడా ఉత్సాహంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ముందస్తుగా టిక్కెట్టు కన్ఫర్మ్ అయినట్టుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# పిఆర్టియు టిఎస్ గొల్లపల్లి మండల నూతన కార్యవర్గం

## అధ్యక్షులుగా రాయి శ్రీనివాస్, కార్యదర్శిగా దేవేందర్



గొల్లపల్లి సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) : గొల్లపల్లి మండల నూతన కార్యవర్గన్ని పిఆర్టియు జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాళ్ల అమర్నాథ్ రెడ్డి, జిల్లా ప్రధాకార్యదర్శి బోయినిపల్లి ఆనంద్ రావు, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు సంధి శ్రీనివాస్ రెడ్డి, ఏవిఎన్ రాజుల సమక్షంలో ఆదివారం జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గొల్లపల్లి మండల నూతన పిఆర్టియు టిఎస్ అధ్యక్షులుగా రాయి శ్రీనివాస్, ఎస్జిటి చందోలి ప్రధాన కార్యదర్శి గా కొంగ్ర దేవేందర్, ఎస్జిటి మల్లన్న పేట, అసోసియేటెడ్ మహిళా అధ్యక్షురాలుగా హెచ్.రచన, అసోసియేటెడ్ అధ్యక్షులుగా లక్ష్మణ స్వామి, మహిళా ఉపాధ్యక్షురాలుగా భాగ్యలక్ష్మి, కార్యదర్శి గా రవీందర్ లు ఎన్నికయ్యారు.గొల్లపల్లి మండలంలో పిఆర్టియు టిఎస్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రాయి శ్రీనివాస్ తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## బాలికల రక్షణ కోసం పాఠశాలల్లో

# కరాటే శిక్షణ తరగతులు నిర్వహించండి

### రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కి వినతి..

జమ్మికుంట సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) : నూతనం గా బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన హుప్ క్వాండో మార్షల్ ఆర్ట్స్ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కరాటే మాస్టర్ మహమ్మద్ మహమూద్ తెలంగాణ రాష్ట్రం లో మహిళల ఆత్మరక్షణ కోసం ప్రతీ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల లో కరాటే శిక్షణ తరగతులు నిర్వహించాలి అని కోరడం జరిగింది . వారు సానుకూలం గా స్పందించి ఈ విషయం ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకు వెళ్తానని అన్నారు. అదేవిధంగా జెండర్ ఈక్వాలిటీ రాణి లక్ష్మీబాయి ఆత్మ పరిరక్షణ సెల్ఫ్ డిఫెన్స్ క్రిందా తెలంగాణ రాష్ట్రం లోని పాఠశాలలకు సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ కోసం సెప్టెంబర్ 1 నుంచి సెల్ఫ్ డిఫెన్స్ తరగతులు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చెయ్యడం మంచి విషయం అని కొనియాడారు 2024 -2025 సంవత్సరములో 5748 పాఠశాల లో యీ కార్యక్రమం ను నిర్వహించడం జరుగుతుంది యీ కార్యక్రమం 3 నెలల పాటు జరుగుతు%శీ%ది ఒక్కో నెలకు 5000 చొప్పున 3 నెలలు పాటు కరాటే శిక్షకులకు వేతనం యివ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమం ను సద్వినియోగం చేసుకొని మంచి మెలుకువలు నేర్చుకోవలని వారు కోరారు. దీని కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 8,62,20,000 రూపాయలను కేటాయించడం జరిగింది.యీ కార్యక్రమం ను 3 నెలలకు ఒకసారి కాకుండా రెగ్యులర్ గా అకడమిక్ ఇయర్ మొత్తం అమలు చేయాలని మహమ్మద్ మహమూద్ తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ ను కోరడం కోరారు. కరాటే ను ఇండియన్ ఒలంపిక్ క్రీడలలో చేర్చడం జరిగింది కాబట్టి విద్యార్థి దశ నుంచే మంచి శిక్షణ ఇవ్వడం ద్వారా అంతర్జాతీయ టోర్నమెంట్ లో రాణించడానికి అవకాశం ఉందని అన్నారు.




# వాగ్దేవి డిగ్రీ కాలేజ్ లో ఘనంగా మాతృభాష దినోత్సవ వేడుకలు

జమ్మికుంట సెప్టెంబరు 09 (ప్రజా మంటలు) : హుజురాబాద్ పట్టణంలో గల శ్రీ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో కాలోజి నారాయణ గారి జయంతి సందర్భంగా మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశ్రాంత అధ్యాపకులు సాహిత్య వేత్త తత్వవేత్త కవి రచయిత శ్రీ ఎస్ వెంకటేశ్వర్లు గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు గౌరవ అతిథులు హుజురాబాద్ పట్టణ సిఐ తిరు మలేష్ గౌడ్ గారు మరియు ఎస్ఐ గారు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి సీఐ గారు మరియు ఎస్ఐ గారు మాట్లాడుతూ యువత పెడదారిన పడకుండా డ్రగ్స్ మాఫియాను అంతం చేయడం కోసం ప్రతి విద్యార్థి ముందడుగు వేయాల న్నారు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు గురువులు చెప్పే మార్గంలో నడుచుకోవాలని ఆడవాళ్లపై జరిగే అకృత్యాలను ఆపాలంటే కేవలం ఆ మహిళా విద్యార్థుల వల్ల సాధ్యపడుతుంద న్నారు మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహిత్య వేత్త ఎస్ వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స తెలుగు వెలుగులలో అక్షరాల వడివడిలో తెలుగు భాష సాహిత్యంలో చదువులో ప్రతి విద్యార్థి శ్రద్ధ చూపాలని కవులు రచయితలు మేధావులు వారి రచనలు చదవడమే కాకుండా వారి ఆలోచన విధానాలను అవ లంబించాలని నీటి విద్యార్థులే రేపటి దేశ పునాదులని దిక్కచ్చిగా వివరించారు తల్లిదండ్రుల గొప్పతనం గురువులకు గొప్పదనం విద్యార్థులకు అలవోకగా అభివర్ణించారు ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గారు శ్రీ ఏనుగు మహిపాల్ రెడ్డి గారు ప్రిన్సిపల్ ప్రవీణ్ రెడ్డి గారు తెలుగు అధ్యాపకులు కవి గాయకులు శ్రీ మేకల నవీన్ కుమార్ గారు అధ్యాపకులు తిరుపతి, భద్రయ్య, రమేష్,అనిల్, వేణు, వెంకటేష్,స్వామి విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ప్రభుత్వ భూమి ఆక్రమణ పై కలెక్టర్ కు ఫిర్యాదు

జమ్మికుంట సెప్టెంబరు 09 (ప్రజా మంటలు) : సర్వే నెంబర్ 887లో తుడి రవిచంద్రబాబు అలియాస్ రవి చందర్ రెడ్డి 2008వ సంవత్సరంలో తనకు ప్రభుత్వం ఇచ్చిన 102 గజాల భూమికి, అదనంగా 110 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని రేకుల షెడ్డు నిర్మాణం చేసి 2009 సంవత్సరంలో అప్పటి జమ్మికుంట గ్రామ కార్యదర్శి సంతకాలు ఫోర్జరీ చేసి తప్పుడు ఇంటి నిర్మాణా అనుమతి పత్రాలను సృష్టించుకుని ఇంటి నెంబర్ 2-7-54/%ూ/ఱ% పొందాడు. అట్టి 110 గజాల సుమారు 15 లక్షల విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనపరచు కోవాల్సిందిగా, అదేవిధంగా తప్పుడు దృవపత్రాలతో ప్రభుత్వ భూమిని, ఆక్రమించుకొని ఇంటి నెంబర్ పొందిన రవిచంద్ర బాబు అలియాస్ రవిచంద్ర రెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాల్సిందిగా తేదీ 9/09/2024 రోజున ప్రజావాణిలో కలెక్టర్ గారికి ఇవ్వడం జరిగింది వెంటనే వారు సంబంధిత జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మరియు జమ్మికుంట తాసిల్దార్ గారిని వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోమని ఆదేశించారు.



# ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

కొడిమ్యాల: సెప్టెంబరు 09 (ప్రజా మంటలు) : కొడిమ్యాల మండలం లోని తిరుమలా పూర్ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి జ్యో స్నా దేవి మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు కవి, రచయిత, స్వాతంత్ర సమర యోధుడు అని , అయన చేసిన సేవలకు పద్మ విభూషణ్ అవార్డ్ కూడా వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు సాయిని ఐలయ్య, ఉప్పాల నాగరాజు, ఏ .లక్ష్మీ నారాయణ, ఏనుగు ఆదిరెడ్డి, ఫహీమ్, బాల రాజు,విద్యార్థులు పాల్గొన్నారు.



# పేదల భూములు లాక్కుంటే తిరుగుబాటు తప్పదు

## డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలి - లబ్ధిదారులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



జమ్మికుంట సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) : భుత్వం నివేశన స్థలాలు కేటాయించి, తిరిగి అదే స్థలం డంపింగ్ యార్డ్కు కేటాయించడం సరికాదని వెంటనే డంపింగ్ యార్డ్ ను ఎత్తివేసి లబ్ధిదారులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని లేదంటే ఈ ప్రభుత్వానికి పేదల తిరుగుబాటు తప్పదని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రోజున జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున వర్షంలో సైతం ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ 2006-07 సంవత్సరంలో నాటి,నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 275, 277, 278లో 370 మంది లబ్ధిదారులకు నివేశన స్థలాల పట్టాలు పంపిణీ చేశారన్నారు. పట్టాలు పంపిణీ చేసి కనీస సౌకర్యాలు కల్పించడంలో నాటి పాలకులు పూర్తిగా విఫలమైనారన్నారు. అనేక వ్యయప్రయాసాలకు ఓర్చి, అప్పులు తెచ్చి కొంతమంది ఇల్లు నిర్మించుకొని సంవత్సరాలు తరబడి కనీస సౌకర్యాలు లేకున్నా నివాసం ఉన్నారని, అదే పేదలకు ఇచ్చిన స్థలంలో మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్ కు కేటాయించామని రెవెన్యూ అధికారులు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులే ఇలా చేయడం దుర్మార్గమన్నారు.

370 మంది లబ్ధిదారులకు 80 గజాల చొప్పున నాటి, నేటి కాంగ్రెస్ ప్రభుత్వమే గుర్తించి నివేశస్థలాలు కేటాయించిందని, వారందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రజల ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీదేనన్నారు. సంవత్సరాల తరబడి లబ్ధిదారులు తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎమ్మార్వో మొదలుకొని, కలెక్టర్, మంత్రుల చుట్టూ పలుమార్లు తిరిగి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోగా కేటాయించిన స్థలాన్ని డంపింగ్ యార్డ్కు కేటాయించామని చెప్పడం శోచనీయమన్నారు. వెంటనే డంపింగ్ యార్డ్ ని ఎత్తివేసి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు నిధులు మంజూరు చేసి కేటాయించిన స్థలంలోనే ఇల్లు కట్టించి ఇవ్వాలని, త్రాగునీటి సౌకర్యం, కరెంటు సౌకర్యం, రహదారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.లబ్ధిదారులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని తమకు కేటాయించిన స్థలము తమకే ఉండాలని కోరుతున్నారని, వారి కోరిక న్యాయబద్ధమైనవన్నారు. పొమ్మనలేక పొగబెట్టినట్లు మున్సిపాలిటీ సిబ్బంది తాము కట్టుకున్న ఇళ్ల ముందు చెత్త కుప్పలు పోయడంతో దుర్గంధం వస్తుందని, రోగాల బారిన పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వానికైనా పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉంటుందని, నోటికి వచ్చిన ముద్దను తిరిగి లాక్కోవడం మంచిది కాదన్నారు. 370 మందిలో అందరూ కూడా కూలి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారేనని, అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నిరుపేదలే లబ్ధిదారులుగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి లబ్ధిదారులకు కేటాయించిన స్థలంలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, డంపు యార్డును ఎత్తివేయాలని వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. లేనియెడల బాధితుల పక్షాన సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తుందని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం బాధితులకు వెన్నంటే ఉంటుందన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి నరేష్ పటేల్, లబ్ధిదారులు నాగిశెట్టి వెంకటేశ్వర్లు, పూదరి అనంత, పిక్కల కమల, దామెర సంతోష్, సత్తి సమ్మయ్య, గొర్రె స్వరూప, మాదాసు రవీందర్లతోపాటు 120 మందికి పైగా లబ్ధిదారులు పాల్గొన్నారు.



# సహస్ర లింగాల దేవాలయంలో మహాశివునికి ప్రత్యేక పూజలు

జగిత్యాల సెప్టెంబరు 09 (ప్రజా మంటలు) :
రూరల్ పొలాస, సహస్ర లింగాల దేవాలయంలో గణేశ్ నవరాత్రుల్లో భాగంగా గణనాథునికి, ప్రత్యేక పూజలు, మహాదేవునికి అన్న పూజ, అభిషేకాలు నిర్వహించారు, ఈ సందర్భంగా గణేశ్ నవరాత్రుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు. మహాదేవునికి అభిషేకాలు నిర్వహించి అనంతరం గణేష్ మహోత్సవంలో భాగంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి సామూహికంగా నక్షత్ర హారతి సమర్పించారు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని మహాదేవుని, గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ప్రముఖులు ఆలయ నిర్వాహకులు నల్ల మాస గంగాధర్ భక్తులు పాల్గొన్నారు.

# అయోధ్య రాములవారి కండువాలు పంపిణి

## శ్రీ రామ త్రీత క్షేత్ర ట్రస్ట్ అక్షింతల కమిటీ



కొడిమ్యాల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :
కొడిమ్యాల మండల కేంద్రంలోనీ శ్రీ సీతారామ ఆలయంలో శ్రీ రామ త్రీత క్షేత్ర ట్రస్ట్ అక్షింతల కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయోధ్య నుండి రాములోరి కండువాలు తెప్పించి చెన్న దేవేందర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు మరియు చిత్రపటాలు కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి హిందూ దేవాలయాల దర్శనాలకు వెళ్లాలని భక్తిని పెంపొందించాలని ప్రతి వ్యక్తి హిందువునని గర్వించి హిందువుగా జీవించాలని అన్నారు. గ్రామంలోని ఆలయాలను దర్శించుకుని గణపతి మండపాల వద్దకు వెళ్లి వినాయకుడిని దర్శించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంచాల శ్రీనివాస్ కంచర్ల రామ స్వామి. చెన్న దేవేందర్ రామగిరి నారాయణ అంకం జనార్ధన్ ఆడ్లగడ్డ రమేష్ ఆదిరెడ్డి నాంపల్లి రామచంద్రం చుక్క శ్రీనివాస్ ఎర్రోజు శ్రీధర్ మాణిక్యం శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

# కోరుట్లలో పటేల్ యూత్ ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు..



కోరుట్ల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :
పట్టణంలోని పటేల్ యూత్ గణేష్ టెంపుల్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రుల వేడుకలు అర్చకులు. నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విగ్నేశ్వరుని అందంగా అలంకరించి వినాయకుడిని లైటింగ్ తో డెకెరెషన్ తో మండపాన్ని అలంకరించారు ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం నవగ్రహ పూజ,,గౌరీ పూజ వైభవంగా నిర్వహించారు. యూత్ సభ్యులు, మహిళలు,పిల్లలు, పాల్గొన్నారు. మాకు,వినాయకుడి వేడుకలకు సహాకరించిన దాతలకు,యూత్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



# ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు

## జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :
నిజాం నిరంకుశ పాలనపై కలం ఎక్కుపెట్టిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు అని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా కలెక్టర్ ప్రాంగణంలో జిల్లా వెనుకబడిన తరగతి అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ భాషకు అస్తిత్వ స్పృహను పెంచడంలో కాళోజీది కీలకపాత్ర అని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో గౌరవించిందన్నారు. ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు అని తెలిపారు. తెలుగు భాష పట్ల ప్రజాకవికి ఎనలేని మమకారం ఉండేదని, అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా కాళోజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. రాంబాబు, కలెక్టరేట్ ఏ. ఓ. హన్మంత రావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట ప్రభుత్వ హాస్పిటల్ ఇన్చార్జి సూపరిండెంట్‌గా పారిపెల్లి శ్రీకాంత్ రెడ్డి..



జమ్మికుంట సెప్టెంబరు 09 (ప్రజా మంటలు) :
జమ్మికుంట ప్రభుత్వ హాస్పిటల్ ఇంచార్జ్ సూపరిండెంట్ గా డాక్టర్ పారిపెల్లి శ్రీకాంత్ రెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంచార్జ్ సూపరిండెంట్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని ఆయన తెలిపారు. జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వనరులతోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని భవిష్యత్తులో ఉన్నత అధికారుల దృష్టికి ఈ హాస్పిటల్ లో నెలకొన్న సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా ప్రయత్నం చేస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్ కి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా మేము మా సిబ్బంది పని చేస్తామని దానికి ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ప్రస్తుతం హుజరాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ లో సజ్జనగా విధులు నిర్వహిస్తున్నానని కలెక్టర్ ఆదేశాల మేరకు జమ్మికుంట ప్రభుత్వ హాస్పటల్ ఇన్చార్జి సూపర్డెంట్ గా బాధ్యతలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు..

# మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దు

## కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ జువ్వాడి



కోరుట్ల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :
మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తన భవిష్యత్తును కాపాడుకోవాలని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. కోరుట్లలోని జువ్వాడి భవన్లో రోజున మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దానిపై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఆయన పేర్కొన్నారు.ఇటీవల కాలంలో యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని ఆయన తెలిపారు. మాదక ద్రవ్యాలతో అనారోగ్యం పాలై జీవితాలు అంధకారం అవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ప్రపంచం మొత్తం కూడా మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరు ఇందులో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కోరుట్ల నియోజకవర్గంలో సైతం మత్తు పదార్థాల వినియోగం పెరిగిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మత్తు పదార్థాల నియంత్రణ కోసం ప్రత్యేక దృష్టి సారించి వినియోగించు, సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. మత్తు పదార్థాల విషయంలో ప్రజల్లో చైతన్యం మరింత రావాలని, యువతలో కూడా మార్పు రావాలని అప్పుడే మత్తు పదార్థాల వినియోగ నివారణ సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. సంబంధిత విభాగాల అధికారులు సైతం మత్తు పదార్థాల నివారణపై మరింతగా దృష్టి సారించాలని ఆయన కోరారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను, యువతను మరింత చైతన్యం చేయాలని ఆయన సూచించారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా జరిగే నష్టాలను వివరించాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా, నిమజ్జన ఉత్సవాలను జరుపుకోవాలని జువ్వాడి నర్సింగరావు కోరారు.

# ప్రజారోగ్యం ప్రస్తుత ప్రధాన లక్ష్యం

## -ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

(రామ కిష్టయ్య సంగన భట్ల - ప్రజా మంటలు)ధర్మపురి సెప్టెంబర్ 09
ప్రస్తుత వర్షాకాల పరిస్థితులలో ప్రజారోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యం అని ప్రభుత్వ విప్, డిసిసి అధ్యక్షుడు, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే ధర్మపురి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ...వ్యాధుల బారిన పడిన ప్రజల ఇబ్బందుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా విఫలం అయిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రెస్ మీట్ లో ఆరోపించడాన్ని లక్ష్మణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. జిల్లాలో విష జ్వరాలు ప్రబలు తున్న విషయం వాస్తవమని, అయితే జిల్లా యంత్రాంగం పూర్తి చర్యలు చేపడుతున్నదని అన్నారు. జిల్లా కలెక్టర్ అన్ని ఆసుపత్రులు సందర్శించి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. మేడారం, పైడిపెల్లి తదితర గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించా మన్నారు. అన్ని ఆసుపత్రులలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలో ధర్మపురిలో కలెక్టర్ ఆధ్వర్యంలో మెగా వైద్య పరీక్షల శిబిరం నిర్వహిస్తామన్నారు. ఎ ఎన్ ఎంలు, ఆశా కార్యకర్తలు ఇల్లిల్లూ తిరుగుతూ సహకారం అందిస్తున్నారన్నారు. మాజీ మంత్రి కొప్పుల ప్రభుత్వంపై బురద చల్లే ఆలోచన మానుకోవాలన్నారు. కరోనా విజృంభణ సమయంలో, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆరోగ్య మంత్రి హరీష్ రావు, బాధుల చికిత్సను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చ లేదన్నారు. ధర్మపురి ప్రాంత రోగులకు కనీసం అంబులెన్స్ సౌకరం కల్పించే ప్రయత్నం జరగ లేదన్నారు. బెడ్స్ లేక ఆసుపత్రులు నిండుగా ఉంటే నాడు ప్రభుత్వం చేతులు ఎత్తి కూర్చుందన్నారు. ధర్మపురిలో మాతా శిశు ఆసుపత్రికి ప్రారంభోత్సవం చేశారే తప్ప, అందుబాటులోకి తేలేదన్నారు. ఇంకా పనులు మిగిలే ఉన్నాయన్నారు. ప్రధాన ఆసుపత్రిలో ఐ సి యూ ప్రారంభం చేయలేదన్నారు. తాము నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని రకాలా బాగోగులు చూస్తున్నామని నొక్కి చెప్పారు.
పి సి సి సభ్యులు దినేష్, నాయకులు జక్కు రవి, చిలుముల లక్ష్మణ్, వేముల రాజేశ్, ప్రసాద్, కస్తూరి శ్రీనివాస్, సి. హెచ్ రాజేశ్, కుంట సుధాకర్, సుముఖ్, నిషాంత్ రెడ్డి, అప్పం శ్రావణ్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.



# జగిత్యాల జిల్లాలో 9 మంది ఎమ్మార్వోల బదిలీ

జగిత్యాల సెప్టెంబర్ 03 ( ప్రజామంటలు) :
జగిత్యాల జిల్లాలోని తొమ్మిది మంది తహశీల్దార్ లను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కథలాపూర్ ఎమ్మార్వో గా వి.వినోద్ ను పెగడపల్లి ఎమ్మార్వోగా, రవీందర్ నియామకమయ్యారు., పెగడపల్లిలో పని చేసిన ఆర్.శ్రీనివాస్ ను మెట్ పల్లి కి కథలపూర్ లో పనిచేస్తున్న ముంతాజ్బుద్ధిన్ బీర్పూర్ బదిలీ కాగా అక్కడ ఉన్న ఏ శ్రీనివాస్ జగిత్యాల రూరల్ కు, రూరల్ ఎమ్మార్వో గా ఉన్న సి.రామ్ మోహన్ జగిత్యాల అర్బన్ కు బదిలీ చేశారు. జగిత్యాల రూరల్ ఎమ్మార్వో గా ఉన్న వరందన్ సారంగాపూర్ కు అక్కడ ఉన్న జి రమేష్ కొడిమ్యాల కు బదిలీ చేయగా కొడిమ్యాల ఎమ్మార్వో గా పని చేసిన బి.రాజమణి కోరుట్ల డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా బదిలీ అయ్యారు.

# ఏకేవీఆర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



భీమదేవరపల్లి, సెప్టెంబర్ 09 (ప్రజామంటలు) :
మండలంలోని ముల్కనూరు ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ భూపతి శ్రీకాంత్ మాట్లాడుతూ, కాళోజి నారాయణరావు తన సాహిత్యం ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేశారని కొనియాడారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం కాళోజీ జయంతిని తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారులు గుంటి ఓదెలు, సుప్రియ, ఎన్ఎస్-ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మన ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయకునికి ప్రత్యేక పూజలు

కోరుట్ల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని మన ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రుల వేడుకలు అర్చకులు బ్రహ్మన్న గారి శంకర్ నేతృత్వంలో ఆదివారం రోజున సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముందుగా రెండవ రోజు విగ్నేశ్వరుని అందంగా అలంకరించి మంటపం ప్రత్యేకంగా బంతిపూలతో అలంకరించిన అనంతరం నవగ్రహపూజ, గౌరీ పూజ వైభవంగా నిర్వహించామని మన ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉరుమడ్ల శ్రీనివాస్, గౌరవ సలహాదారులు కటుకం గణేష్, నీలి అనిల్, మన ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు లింగ ఉదయ్ కుమార్, కొండ్లెపు అర్జున్, మన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సైదు గంగాధర్, శోభన్ రావు, వనతడుపుల నాగరాజు, బాలే అజయ్, కత్తిరాజ్ శంకర్, గుడిసే కోటేష్, దయ మదన్, కోడూరి ప్రేమ్ కుమార్, వన తడుపుల సంజీవ్, వెంకట్ రెడ్డి భార్గవ్, చంద్రకంటి శ్రీధర్, తుమ్మల శేఖర్ బచ్చు వంశీ, సంగ మహేష్, కట్టేకోల సురేష్, చింతోజీ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో ఘనంగా పాత్రికేయుడి జన్మదిన వేడుకలు

కోరుట్ల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, తెలంగాణ కెరటం దినపత్రిక జగిత్యాల జిల్లా ప్రతినిధి మిట్టపెల్లి రమణ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాత్రికేయ సోదరులు, ఆత్మీయ మిత్రుల సమక్షంలో శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కటుకం గణేష్, నంద్యాడపు శ్రీనివాస్, కత్తిరాజ్ శంకర్, కోరుట్ల పద్మశాలి సంఘం అద్యక్షులు గుంటుక ప్రసాద్, కోశాధికారి అందె రాజ్ కుమార్, కార్యవర్గ సభ్యులు ఎక్కలదేవి రామచంద్రం తదితరులు పాల్గోన్నారు.



# ప్రజల భాగస్వామ్యం తోనే పోషణ మాసం విజయవంతం

- **జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్**

ధర్మపురి సెప్టెంబర్ 09 (ప్రజామంటలు - రామ కిష్టయ్య సంగన భట్ల)

ప్రజల సంపూర్ణ భాగస్వామ్యం తోనే పోషణ మాస కార్యక్రమాలు విజయవంతం కాగలవని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30 వరకు జిల్లాలో నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమాల గురించి సోమవారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ జిల్లా అధికారులతో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు తీసుకోవలసిన పోషకాహారం గురించి వివరించే ప్రదర్శనలు, సమావేశాలు, ర్యాలీలు, మేళా వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఆశ, ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్లు గ్రామైక్య సంఘాల సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పోషణ్ మహాలో పాలు పంచుకోవాలని అన్నారు. ఆటలు, కథ నాటకం, బేబీ షో వంటి కార్యక్రమాల ద్వారా పోషకాహారం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ బి.నరేష్ మాట్లాడుతూ పిల్లల్లో లోప పోషణ నివారించి పోషణ స్థాయిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు



తెలిపారు. నిర్దిష్టమైన ప్రణాళిక ద్వారా అంగన్వాడి స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణ గురించి మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను పిపిటి ద్వారా ప్రదర్శిస్తామన్నారు. అంగన్వాడీలు ప్రాథమిక విద్యా కేంద్రాలుగా ప్రభుత్వం గుర్తించిందని, ఆరేళ్ల లోపు పిల్లలందరినీ అంగన్వాడీలో చేర్పించాలని కోరారు. అనంతరం పోషణ మాసం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాంబాబు, గౌతమ్ రెడ్డి, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



# ఉమ్మడి వరంగల్ జిల్లాలో "ఓరుగల్లు కళా శిఖరాలు" నూతన సంఘం ఆవిర్భావం

వరంగల్ సెప్టెంబర్ 09 ( ప్రజామంటలు) :

ఉమ్మడి వరంగల్ జిల్లాలో నూతనంగా ఏర్పడ్డ "ఓరుగల్లు కళా శిఖరాలు" సంఘం వరంగల్, హన్మకొండల అభివృద్ధికి, కళాకారుల అభివృద్ధి కొరకు కొన్ని సూచనలను చేస్తూ, అధ్యక్షులు జూపాక శివ, ప్రధాన కార్యదర్శి వాంకుడోతు రమేష్ లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

భద్రకాళి బండ్ పై అమర కళాకారుల విగ్రహాలు ప్రతిష్టించాలనీ. నిరుద్యో కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కళాకారులకు 250 గజాల ఇంటి స్థలం అందించాలని కోరారు. వృద్ధ కళాకారుల అందర్నీ గుర్తించి పెన్షన్లు అందించాలని, కళాకారులందరికీ ఆరోగ్య భీమా వర్తింపజేయాలని కోరారు. కళలకు పుట్టినిల్లు, అనేక ఉద్యమాల సాంస్కృతిక పోరాట చరిత్ర కలిగిన ఓరుగల్లు జిల్లా అమర కళాకారులు శంకర్ సారంగపాణిల వారసత్వాన్ని కొనసాగింపుగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కళాకారులు ఎవరికి వారు యేమునా తీరే అన్న చంధంగా ఉండి, ఎవరికి కష్టం వచ్చినా నష్టం వచ్చినా ఐక్యత లేక మాట్లాడే దిక్కు లేక చాలామంది కళాకారులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో సకల కళలను కాపాడుతూ సీనియర్ కళాకారులను గౌరవిస్తూ నూతన యువ కవి గాయకులను ప్రోత్సహిస్తూ వారి సమస్యలు పరిష్కరించుకునేందుకు వరంగల్ ఉమ్మడి జిల్లా తరపున ఐక్యంగా ఉండడం కోసం ఈ యొక్క ఓరుగల్లు కళాశిఖరాలు అనే సంఘాన్ని నూతనంగా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అన్ని రకాల కళారూపాలు కలిగిన కళాకారులను కలుపుకుంటూ నూతన కార్యక్రమాలు చేస్తూ ఈ సంఘం ముందుకెళ్తుంది. 60 మంది ఉమ్మడి వరంగల్ జిల్లా కళాకారులు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న "ఓరుగల్లు కళా శిఖరాలు" నూతన కమిటీ- అధ్యక్ష, కార్యదర్శి లతో కలిపి పూర్తి కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

ఈ కార్యక్రమానికి హాజరైన కళాకారులు ధారా దేవేందర్, డా" వెన్నెల శ్రీనాథ్, వాజిద్ హుస్సేన్ జాఫర్, పులుకుర్తి రాజేందర్, తాళ్ల సునీల్, గోల్కొండ బుచ్చన్న, కొండ సారంగపాణి, దేవునూరి వేణు, ఇనుగుర్తి మధు, తదితరులు హాజరయ్యారు.

# ఆప్' ఒంటరిపోరు

పలుమార్లు చర్చలు జరగ్గా..సీట్ల సర్దుబాటు వ్యవహారంలో నెలకొన్న ప్రతిష్టంభన ఆ ప్రక్రియకు అడ్డంకిగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆప్ కీలక నిర్ణయం తీసుకుంది. 20 మంది అభ్యర్థులతో తొలి జాబితాను సోమవారం మధ్యాహ్నం ప్రకటించింది. దీంతో హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్-ఆప్ మధ్య పొత్తుపై నీలినీడలు కమ్ముకొన్నాయి.హరియాణాలో అక్టోబర్ 5న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్లు వేసేందుకు గడువు సెప్టెంబర్ 12వరకే ఉంది. అయితే, ఇరు పార్టీల మధ్య ఇప్పటివరకు సీట్ల కేటాయింపు వ్యవహారంపై స్పష్టత రాలేదు. దీంతో 20మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసిన ఆప్.. తమ పార్టీ హరియాణా ఉపాధ్యక్షుడు అనురాగ్ ధండాను కలయాత్ సీటు నుంచి బరిలోకి దించింది .అలాగే, భివానీ నుంచి శర్మ, మేహమ్ సీటు నుంచి వికాశ్ నెహ్రా, రోహ్‌తక్ నుంచి బిజేందర్ హుడాలను బరిలో దించుతున్నట్లు ప్రకటించింది. ఆప్ హరియాణా రాష్ట్ర అధ్యక్షుడు సుశీల్ గుప్తా మాట్లాడుతూ.. ఈ సాయంత్రానికి సీట్ల వ్యవహారం ఖరారు కాకపోతే మొత్తం 90 స్థానాలకు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని కూడా ప్రకటించడం గమనార్హం.వచ్చే నెలలో హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. హరియాణాలో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ఆప్ 10 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తూ ఆ మేరకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తోంది. కానీ, ఏడు సీట్లు ఇచ్చేందుకు మాత్రమే కాంగ్రెస్ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత కె.సి.వేణుగోపాల్, ఆప్ సీనియర్ నేత రాఘవ్ చడ్డా ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. కానీ, ఇప్పటివరకు సీట్ల కేటాయింపు అంశం కొలిక్కి రాకపోవడంతో ఆప్ తన అభ్యర్థుల జాబితాను ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# హైకోర్టు తీర్పు హర్షణీయం

## -పార్టీ మారిన ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

వేలేరు సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :



వేలేరు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీలో గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని బీఆర్ఎస్ మండల నాయకుడు కొయ్యడ మహేందర్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ మారిన ముగ్గురు ఎమ్మెల్యేలపై కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు స్పీకర్ అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.పార్టీ మారిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కష్టం గెలిచారని అన్నారు.పార్టీ మారిన ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైన రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలవాలని అన్నారు.

# ప్రజావాణి బుధవారానికి వాయిదా

హైదరాబాద్ సెప్టెంబర్ 09 ( ప్రజామంటలు) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం జరిగే ప్రజావాణి కార్యక్రమం బుధవారానికి వాయిదా వేయడం జరిగిందని ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య తెలిపారు. ప్రజాభవన్ లో 16వ ఆర్థిక సంఘం సమావేశాలు జరుగుతున్నందున మంగళవారం నాడు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమం బుధవారానికి వాయిదా వేసినట్టు వారు తెలిపారు. ఈ మార్పును అనుసరించి అర్జీదారులు బుధవారం నాడు ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు స్వీకరణలు ఈ నెల 17 వరకు పొడిగింపు

## జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల సెప్టెంబర్ 9 (ప్రజా మంటలు)




జిల్లా మున్సిపాలిటీ పరిధిలో నూక పెల్లి డబుల్ బెడ్ రూం ఇండ్లలో లబ్ధిదారులకు పంపిణీ చేయగా మిగిలిన ఇండ్లకు మీ సేవ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 9 వ తేదీ ముగుస్తుందని, ఈ సందర్భంలో అప్లికేషన్లు స్వీకరించుటకు ఈ నెల 17 వరకు పొడగించినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు కుల ధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్లు తెచ్చుకోనుటలో జాప్యం వలన అసలైన లబ్ధిదారులు నష్టపోకుండా ఉండటం కోసం అప్లికేషన్ల స్వీకరణను గడువు పెంచినట్లు పేర్కొన్నారు. గతంలో తెలిపిన విధంగా మీ సేవ కేంద్రం ద్వారా నూతన ఆర్జి దారులు దరఖాస్తు చేసుకొని, డాక్యుమెంట్లు లేని యెడల మీ సేవలో డాక్యుమెంట్లు స్వీకరించబడవని తెలిపారు. మీ సేవ కేంద్రంలో ఆర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్జిలు స్వీకరించవలెనని కలెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రెస్ క్లబ్ గణేష్ మండపం వద్ద కొనసాగుతున్న ప్రత్యేక పూజలు

జగిత్యాల సెప్టెంబర్ 09 (ప్రజా మంటలు) :

జగిత్యాల పట్టణంలోని ప్రెస్ క్లబ్ నూతన భవనంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద ఉదయం, సాయంత్రం పాత్రికేయులు కుటుంబాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ వివిధ రకాల నివేదనలతో ప్రత్యేకంగా అర్చనలు, అభిషేకము చేస్తున్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ తో పాటు మహా ఆశీర్వచనము మంగళహారతి, మంత్రపుష్పం నిర్వహించారు.







# మంకీపాక్స్ డేంజర్‌బెల్స్

- **భారత్‌లో తొలికేసు నిర్ధారణ**
- **క్లేడ్-2 రకంగా గుర్తింపు**
- **ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**
- **అనుమానితులకు పరీక్షలు చేయండి**
- **కాంటాక్టులను గుర్తించండి**
- **కేంద్రం నుంచి రాష్ట్రాలకు సూచన**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):

భారత్‌లో మంకీపాక్స్ కేసు నిర్ధరణ అయ్యింది. విదేశాల నుంచి వచ్చిన ఓ యువకుడి నమూనాలను పరీక్షించగా.. అది పశ్చిమ ఆఫ్రికాలో వ్యాప్తిలో ఉన్న క్లేడ్-2 రకంగా తేలింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల ప్రకటించి ఆత్యయిక స్థితికి కారణమైన క్లేడ్-1 కాదని.. ప్రస్తుతానికి ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. బాధితుడి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని తెలిపింది.విదేశాల నుంచి భారత్‌కు వచ్చిన ఓ యువకుడిలో మంకీపాక్స్ లక్షణాలు గుర్తించారు. దీంతో వెంటనే ఐసోలేషన్‌లో ఉంచి నమూనాలను లేబొరేటరీకి పంపించారు. అది మంకీపాక్స్ అని నిర్ధరణ అయ్యింది. అయితే, గతంలో భారత్‌లో వెలుగు చూసిన (జులై 2022 నుంచి) 30 కేసుల మాదిరిగానే ఈ కేసు ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. డబ్ల్యూహెచ్‌వో ఇటీవల ప్రకటించిన ఆందోళనకర క్లేడ్-1 రకం కాదని స్పష్టం చేసింది.మంకీపాక్స్ 1958లో డెన్మార్క్‌లో తొలిసారి కోతుల్లో వెలుగు చూసింది. వీటిని పరిశోధన కోసం తెప్పించడం గమనార్హం. 1970లో మానవుల్లో తొలిసారి గుర్తించారు. 2005లో కాంగోలో వేల సంఖ్యలో ఈ కేసులు నమోదయ్యాయి. 2017 తర్వాత నైజీరియా సహా అనేక దేశాలకు వ్యాపించింది. 2022 నుంచి మళ్లీ విస్తృతంగా వ్యాప్తి చెందుతూ అనేక దేశాలకు పాకింది. 2022 నుంచి ఆగస్టు 2024 వరకు 120 దేశాల్లో వెలుగుచూడగా.. సుమారు లక్ష కేసులు నిర్ధరణ అయ్యాయి. తాజాగా కాంగోలో ఆందోళనకర స్థాయిలో ప్రాణాంతక వైరస్ వ్యాపిస్తోంది.

మంకీపాక్స్ అనుమానితులకు పరీక్షలు..

కాంటాక్టులను గుర్తించండి: కేంద్రం నుంచి రాష్ట్రాలకు అడ్వైజరీ

ఓజూనీలీ ఇంటర్నెట్‌డెస్క్: దేశంలో తొలిసారి మంకీపాక్స్ అనుమానితుడిని గుర్తించడంతో కేంద్రం అప్రమత్తమై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కీలక అడ్వైజరీ జారీ చేసింది.ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వ్యాధిని పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా జారీ చేసిన హెల్త్ అడ్వైజరీ ప్రకారం భారత్‌లో ఇప్పటి వరకు ఒక్క మంకీపాక్స్ కేసు కూడా నిర్ధరణ కాలేదు. కానీ, దీని విషయంలో రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ క్రమంలో ఆరోగ్యమంత్రిత్వ శాఖ సూచించిన వ్యూహాలను అమలు చేయాలని పేర్కొంది.దేశంలో మంకీపాక్స్ క్లస్టర్లను గుర్తించడానికి నేషనల్ ఇంటిగ్రేటెడ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ పనిచేస్తోందని పేర్కొన్నారు. ఎయిర్ పోర్టుల్లో మంకీపాక్స్ స్క్రీనింగ్ మరింత వేగవంతం చేసినట్లు వెల్లడించింది. అనుమానిత కేసులను పరీక్షించేందుకు వీలుగా ఐసీఎంఆర్ ఆధీనంలోని పరిశోధనాశాలల నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తున్నట్లు హెల్త్ మినిస్ట్రీ పేర్కొంది. రాష్ట్రాలు చర్మ, ఎస్‌టీడీ వ్యాధులకు చికిత్స చేసే క్లినిక్స్‌పై దృష్టిపెట్టాలని సూచించింది. వ్యాధి లక్షణాలు కనిపించిన పేషెంట్ల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఈ వ్యాధి, దాని వ్యాప్తిపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తెలిపింది. ప్రజల్లో అనవసర భయాలు పోగేట్టేందుకు కృషి చేయాలని కేంద్ర ఆరోగ్యశాఖ తన అడ్వైజరీలో పేర్కొంది.ఈ వ్యాధిని 1958లో తొలిసారి గుర్తించారు. 1970లో మొదటిసారిగా ఓ మనిషికి ఇది సోకింది. ముఖ్యంగా ఉష్ణమండల ఆఫ్రికా దేశాల్లోని మారుమూల గ్రామాల్లో మాత్రమే ఎక్కువగా కనిపించేది. అయితే ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, ఆరోగ్య విభాగాలు దీనిని నిర్లక్ష్యం చేశాయి. తొలిసారి 2022లో భారీస్థాయిలో మంకీపాక్స్ వ్యాపించింది. దీంతో ఉలిక్కిపడిన ప్రపంచ దేశాలు దీనిపై పరిశోధనలకు నిధులను పెంచాయి. మంకీపాక్స్‌లో రెండు వేరియంట్లు ఉన్నాయి. క్లాడ్-1 (కాంగోబేసిన్ క్లాడ్), క్లాడ్-2 (పశ్చిమ ఆఫ్రికా క్లాడ్)గా వర్గీకరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లాడ్-1 ఐబీ వేరియంట్ వేగంగా వ్యాపించడమే ఆందోళనకు కారణం. లైంగిక సంబంధాల కారణంగా ఈ వేరియంట్ వేగంగా వ్యాపిస్తుంది.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com